గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# నవంబర్ 2015
# కథలు




కరుణాకర్ నైరాశ్యంలో మునిగిపోయాడు.

కారణం..అతనికి పెళ్లై మూడేళ్ళయింది. భార్య గీత చక్కటిచుక్క. ఆమె అందానికి పెళ్లిచూపుల్లో ఫిదా అయిపోయి..వెంటనే నచ్చినట్టుగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చి..ఆవెంటనే మెడలో మూడుముళ్ళూ వేసి తన సొంతం చేసుకున్నాడు.

ఆమె ఎంత అందమైనదో అంత పెంకిది. ఆ విషయం మూడురాత్రుల్లో బాగా బోధపడింది. తను అనుకున్నది జరగాలనే తీవ్రమైన మొండి స్వభావం ఆమెది. 'భగవంతుడు అందమైన తన భార్యకి కాస్త మంచి మనసు కూడా ఇచ్చుంటే ఎంతబాగుండేది?' అని ఎన్నిసార్లు అనుకునేవాడో.రోజూ సరసాలు, సరాగాలకి బదులు చిర్రు బుర్రులు, చిట పటలు మామూలే. కరుణాకర్ దాదాపు సర్దుకుపోతుంటాడు. కానీ

అతనూ మనిషే..అప్పుడప్పుడూ కోపం అవధి దాటి ఓ మాటనేలా చేస్తుంది. అంతే..ఆమె నుంచి సహాయ నిరాకరణ ఉద్యమం మొదలవుతుంది. మంచం మీద సరిహద్దులు చోటుచేసుకుంటాయి. కరుణాకర్ మనసు బాధతో మూలుగుతుంది.

***

ఎప్పట్లానే..ఆరోజు సాయంత్రం ఆఫీసునుంచి ఆరు గంటలకి ఇంటికి వచ్చాడు కరుణాకర్.

అతను రాగానే, అప్పటికే తలంటోసుకుని, చక్కటి లైట్ బ్లూ కలర్ శారీ, దానికి తగ్గ మ్యాచింగ్ బ్లౌజ్ కట్టుకుని, చెవులకి జూకాలు, మెడలో మంగళసూత్రం, నల్లపూసలతో, తలలో పూలు తురుముకుని భూమ్మీద నడయాడే అప్సరసలా ఉంది గీత. అతను కొద్దిసేపు పరవశుడయ్యాడు. ఆమె అతని దగ్గరగా వచ్చి చూసింది. తనకి కావలసింది అతని దగ్గర లేదని తెలుసుకుంది. పగబట్టిన నాగినిలా విస విసా లోపలికెళ్ళిపోయింది. అప్పుడు గుర్తుకొచ్చింది తనేం తప్పుచేశాడో.

***

ఆరోజు గీత పుట్టిన్రోజు. పోయిన సంవత్సరం ఇదే విషయం మీద ఒక చిన్న యుద్ధం జరిగింది. అప్పుడూ ఇలాగే ఆఫీసు నుంచి ఇంటికి వచ్చాడు. తనకి ఎదురొచ్చిన భార్య "ఏవండీ, నేను మీ జీవితంలో అపురూపమైన వ్యక్తినన్నారు. భగవంతుడు ఇచ్చిన వరం అన్నారు" అంది ఉక్రోశం మాటల్లో కనబరుస్తూ.

"అవును డాళింగ్, కాదని ఎవరన్నారు, నువ్వు నాకెప్పటికీ అంతే?"అన్నాడు తేలిగ్గా.

"మరి అలాంటప్పుడు నాకు సంబంధించినవన్నీ గుర్తుంచుకోవాలి కదా.."

"అవునూ.."

"మరివాళ నా పుట్టిన రోజన్న విషయం మరచిపోయారేంటి? పొద్దున్నైతే హడావుడిగా ఆఫీసుకి వెళ్లిపోయారు..పోనీ సాయంత్రమన్నా స్వీటూ, హాటూ, గిఫ్ట్ లో వచ్చి సర్ప్రైజ్ చేస్తారనుకున్నాను. కాని ఉత్తగా చేతులూపుకుంటూ వచ్చారు. అంటే మీ అభిమానం మాటలవరకే, మీ పబ్బం గడుపుకునే వరకే అని అర్థమైంది' అంది మాటలూ, కన్నీళ్ళు ఏకధాటిన కురిపిస్తూ.

"ఛ..ఛ..అదేంలేదురా.."అనునయంగా ఏదో అనబోయాడు.

"ఇంకేం మాట్లాడ వద్దు..చెప్పి చేయించుకోవడం నాకిష్టం ఉండదు"అని విసురుగా వెళ్ళిపోయింది.

ఆ పరిస్థితి నెమ్మళించడానికి చాలా సమయమే పట్టింది.

***

మళ్ళీ అదే పునరావృతమైంది.

అయిపోయింది. ఆమె, తనపట్ల అతను నిర్లక్ష్యం వహించాడనుకుంది.

గబ గబ బట్టలు సూట్కేస్లో సర్దుకుని బయటకి వెళ్ళిపోబోయింది.

"గీతా..ఎక్కడికి? ఇంత చిన్న విషయానికి నన్ను వదలి వెళ్ళిపోతావా? పద ఇప్పుడే నిన్ను బజారుకి తీసుకెళ్ళి నీకు కావలసినవి నిస్తా"అన్నాడు ఉద్వేగంగా.

"హుః, ఇప్పుడా? అడిగి కొనిపించుకోవడం నాకు అసహ్యం. నాకు విలువనివ్వకుండా, మీదగ్గర కేవలం భార్య అనే కీలుబొమ్మలా పడి ఉండాలంటే నాకు కుదరదు. నేను వెళ్ళిపోతున్నాను. నాకు ఇండివిడ్యువాలిటీ ముఖ్యం."అని విస విసా బయటకి వెళ్ళిపోయింది.

ఇది జరిగి మూడు నెలలయింది.

గీతా వాళ్ళ అమ్మా నాన్నలతో, అన్నా వదినలతో మాట్లాడాడు. "గీత సంగతి తెలుసుగా, మొండిఘటం. జరిగిన దాంట్లో తనదే తప్పని మాకు తెలుసు. కానీ ఏం చేయలేం. దాని మూర్ఖత్వానికి కాలమే పరిష్కారం చూపాలి."అన్నారు. సామరస్య ప్రయత్నాలు

ఎన్నో చేశాడు. కానీ లాభం లేకపోయింది.

వైవాహిక జీవితంలో నైరాశ్యం చోటు చేసుకుంది. అతని జీవితం పౌర్ణమి నోచుకోని అమావాస్య అయింది. చూస్తూ చూస్తుండగా దసరా వెళ్ళిపోయింది.

***

దీపావళి అమావాస్య. ఆఫీసుకి సెలవు.

ఇంట్లో డల్ గా కూర్చున్నాడు కరుణాకర్.

ఇంటి బయట ఆటో ఆగిన చప్పుడయింది.

తనింటికి ఎవరూ వచ్చేవాళ్ళు లేకపోవడంతో..సోఫాలో అలాగే కూర్చుండిపోయాడు.

కొద్దిసేపటికి కర్టెన్ తొలగించుకుని గీత సూట్కేస్ తో లోపలికి అడుగెట్టింది.

కరుణాకర్ కి అది 'కలా, నిజమా' అన్న ఆశ్చర్యం..తన భార్య ఇంటికొచ్చిందన్న ఆనందం కలగాపులగంగా మనసులో కలిగి ఉక్కిరిబిక్కిరిచేస్తుంటే.

అమాంతం లేచి గీతని గట్టిగా కౌగలించుకుని"నన్నొదిలి ఎందుకెళ్ళిపోయావు గీతా?..నేనుండగలనా?..అన్నాడు డగ్గుత్తికతో. ఆమె అంతే గట్టిగా అతన్ని అదుముకుని "జీవితం విలువా, వైవాహిక జీవితం విలువా తెలిసొచ్చాయండీ, చిన్న పిల్ల మనస్థత్వంతో ప్రాణాధికంగా ప్రేమించే మీ మనసుని అర్థం చేసుకోలేక. మిమ్మలి బాధపెట్టి, గడపదాటి తప్పుచేశాను. ఇహ ముందెప్పుడూ అలా జరగదు. భగవంతుడు మనిద్దర్నీ కలిపాడు. ఇహ విడిపోవడమన్నది ఊపిరిపోయాకే"అంది ఆమె చెమర్చిన కళ్ళ తడితో అతని భుజాలను వెచ్చ చేస్తూ.

ఆమె మనసు అంతలా మారడానికి కారణమేమిటో తెలియదు. అది తనకి అనవసరం కూడా. తన గీత తన దగ్గరకి వచ్చింది. అది చాలు. "అందరికీ అమావాస్య అశుభం. కాని ఒక్క దీపావళి అమావాస్య మాత్రం అందరూ ఆనందంగా జరుపుకునే పండగ. ఈ దీపావళి అమావాస్యనాడు దేదిప్యమానంగా మనింట్లోకి అడుగెట్టి ఇంటినీ, నా మనసునీ శోభాయమానం చేశావు. నా జీవితంలో ఇదే మరపురాని గొప్ప పండగ"అన్నాడు భార్యని మరింత దగ్గరగా పొదువుకుంటూ.




"హాయ్ వెల్కం టూ దివాలీ స్పెషల్ 'చెప్పుకుంటే చేటంత చెడ్డీ!' ప్రతి ఆదివారం ఉదయం ఎన్నెన్నో చెడ్డీలను మీకు కానుకగా తెచ్చే మీ ఫేవరెట్ ప్రోగ్రాం ఈ రోజు దీపావళి స్పెషల్ గా మీ ముందుకొచ్చింది. ఈ పండుగ రోజు మీ కోసం రకరకాల చెడ్డీలు... రంగురంగుల చెడ్డీలు, పెద్దపెద్ద చెడ్డీలు, చుక్కల చుక్కల చెడ్డీలు, చారల చారల చెడ్డీలు ఎన్నో ఎన్నెన్నో రడీగా ఉన్నాయి. మరి ఇంకెందుకాలస్యం.... వెంటనే 112233 నంబర్ కి డయల్ చేసి అద్భుతమైన చెడ్డీలను మీ సొంతం చేసుకోండి! అన్నట్టు దివాలీ స్పెషల్ గా చెడ్డీలను గెలుచుకున్న ప్రతి ఒక్కరికీ రెండేసి ఎలాస్టిక్స్ పండుగ స్పెషల్ గా మీకు అందిస్తున్న వారు... పీకే చెడ్డీల కంపెనీ! మరి కాల్ వస్తోంది తీసుకుందామా?!"

"హలో..."

"హలో చెప్పుకుంటే చేటంత చెడ్డీ ప్రోగ్రామేనాండీ?"

"హలో అవునండీ... వెల్కం టూ చెప్పుకుంటే చేటంత చెడ్డీ ప్రోగ్రాం!"

"కెవ్వ్... కెవ్వ్!"

"అంత కెవ్వ్ కెవ్వ్ ఎందుకండీ... హలో..."

"హలో చెప్పుకుంటే చేటంత చెడ్డీ ప్రోగ్రామేనా?!"

"ఇదేంటి గొంతు మారింది... ఇందాక ఎవరో లేడీ కదా చేసారు?"

"ఆ... నేను ఆవిడ భర్తని. మీ లైన్ దొరగ్గానే ఆ ఆనందంతో మా ఆవిడ స్పృహ తప్పి పడిపోయింది. దానికేమైనా అవ్వాలి... అప్పుడు స్టూడియోకి వచ్చి నీ అంతు చూస్తా!"

"వామ్మో బ్రేక్!"

మరో మూడు నిమిషాల తర్వాత...

"వెల్కం బేక్ టూ చెప్పుకుంటే దివాలీ స్పెషల్ చేటంత చెడ్డీ ప్రోగ్రాం! కాలర్ రడీగా ఉన్నారు మాట్లాడదామా.... హలో..."

"హలో... నేను కాకినాడనుండి కాంతమ్మను మాట్లాడుతున్నా."

"ఓ వెరీ గుడ్ కాంతమ్మ గారూ... మీరు మా ప్రోగ్రాం రెగ్యులర్ గా చూస్తూ ఉంటారా?"

"అవునండీ ప్రతీ ఆదివారం చెప్పుకుంటే చేటంత చెడ్డీ ప్రోగ్రాం చూసాక కానీ నేను వంట మొదలుపెట్టనండీ!"

"అబ్బ చాలా సంతోషం కాంతమ్మ గారూ! మా ప్రోగ్రాం అంటే మీకెందుకు అంత ఇష్టం?!"

"మిగతా ఛానెల్స్ లా అందరూ ఇచ్చేవి కాకుండా మీరు చెడ్డీలను బహుమతులుగా ఇవ్వడం మాకు చాలా నచ్చిందండీ! ఎందుకంటే శరీరానికి ఎంతో అవసరమైన చెడ్డీ ఇంపార్టెన్స్ ని మీరే ముందుగా గుర్తించి ఇలా ఓ ప్రోగ్రాం చెయ్యడం నిజంగా దేశసేవేనండీ! ఇంత మంచి ఆలోచన వచ్చినందుకు మీకు నిజంగా థ్యాంక్సండీ!

పైగా ఇవ్వాళ దీపావళి కానుకగా బహుమతి గెల్చుకున్న వారికి రెండు ఎలాస్టిక్స్ ఇవ్వడం మరీ మరీ నచ్చిందండీ!"

"వావ్ భలే చెప్పారు కాంతమ్మ గారూ... సరే ప్రోగ్రాం స్టార్ట్ చేద్దామా?! జాగ్రత్తగా మీరు సమాధానం చెబితే ఈ అందమైన చెడ్డీ నిజంగా మీ సొంతమైపోతుంది. రడీనా?!"

"అబ్బ! ఎంతబావుందోనండీ మీరు చూపిస్తున్న రంగురంగుల చెడ్డీ! ఏ చీరకైనా ఇట్టే మేచ్ అయిపోతుంది."

"అదేనండీ ఈ చెప్పుకుంటే చేటంత చెడ్డీ ప్రోగ్రాం స్పెషాలిటీ కాంతమ్మ గారూ! మరి ప్రశ్న వెయ్యనా?"

"ఆ...ఆ... త్వరగా అడగండి కుసుమ గారూ... ఆ చెడ్డీని దూరం నుండి చూస్తుంటేనే నా ఒళ్ళు పులకరించిపోతోంది... దాన్ని బహుమతిగా గెలుచుకుని ఎప్పుడెప్పుడు త్వరగా తొడుక్కుంటానా అని."

"సరే మీ ప్రశ్న.... జాగ్రత్తగా వినండి. ఒక్క చెడ్డీలో ఎన్ని కాళ్ళు పడతాయి?"

"ఒక్క చెడ్డీలో.... ఎన్ని కాళ్ళు... చాలా కష్టమైన ప్రశ్న అడిగారు కుసుమ గారూ!"

"లేదండీ... కొంచెం బుర్ర పెట్టి ఆలోచిస్తే చెప్పేస్తారు... ఆలోచించండి."

"ఎంత ఆలోచించినా తెలియడంలేదండీ.... ఆ తెలిసింది... ఒకటే చెడ్డీ కదా, ఒకటే చెడ్డీ పడుతుందండీ!"

"అయ్యో కాంతమ్మ గారూ... జస్ట్ కొద్దిపాటి తేడాతో మీరు కరెక్ట్ ఆన్సర్ చెప్పలేకపోయారు. బెటర్ లక్ నెక్స్ట్ టైం అండీ... బై!"

"ఓ మై గాడ్ నా ఆన్సర్ తప్పా? అయ్యో... వా....."

"చూసారుగా కాంతమ్మగారు చెడ్డీని బాగా ఇష్టపడ్డారు కానీ పాపం జస్ట్ మిస్సైపోయారు... మరి మీరూ వెంటనే మా చెప్పుకుంటే చేటంత చెడ్డీ దివాలీ స్పెషల్ కి ఫోన్ చేసి కరెక్ట్ ఆన్సర్ చెప్పగలిగితే ఈ అందమైన చెడ్డీ మీ వంటి మీదే అతుక్కుని కళకళలాడిపోవచ్చు... కాబట్టి వెంటనే డయల చెయ్యండి! ఆ మళ్ళీ రింగవుతోంది... ఎవరో ఆ అదృష్టవంతులు చూద్దాం. హలో..."

"హలో... హలో...."

"హలో అండీ... వెల్కం టూ చెప్పుకుంటే చేటంత చెడ్డీ"

"కుసుమగారేనాండీ? చెప్పుకుంటే చేటంత చెడ్డీ ప్రోగ్రామేనా?"

"అవునండీ... నేను కుసుమనే. మీరు చేసింది చెప్పుకుంటే చేటంత చెడ్డీ ప్రోగ్రాంకే!"

"హమ్మయ్య.... థ్యాంక్స్ కుసుమగారూ.... ఎన్నాళ్ళుగానో ప్రయత్నిస్తుంటే ఇన్నాళ్ళకు లైన్ దొరికిందండీ!"

"ఓ అవునా ఇవాళైనా దొరికింది సంతోషించండి.      చెడ్డీల కోసం చాలామంది వెర్రి వెర్రిగా ట్రై చేస్తూ ఉంటారు కదండీ! ఇంతకూ మీ పేరూ ఊరూ చెప్పలేదు"

"నేను పాలకొల్లు నుండి పాపాయమ్మను మాట్లాడుతున్నానండీ!"

"చాలా సంతోషం పాపాయమ్మ గారూ... మా చెప్పుకుంటే చేటంత చెడ్డీ ప్రోగ్రాం మీకు నచ్చిందా?"

"నచ్చడం అన్నది చాలా చిన్న పదమండీ... నాకే కాదండీ మా కాలనీ మొత్తం మీ ప్రోగ్రాముని పడి పడి మరీ చూస్తామండీ! సండే వచ్చిందంటే చాలూ మా టీవీలు ఫోన్లూ ఈ ప్రోగ్రాంతోనే బిజీ అయిపోతాయండీ! ఈరోజు ఈ స్పెషల్ ప్రోగ్రాం కారణంగా దీపావళికి పిండివంటలు వండటం మానేసి మరీ అందరం మీ ప్రోగ్రాం మీదే దృష్టి పెట్టామండీ!"

"హబ్బ చాలా హ్యాపీ అండీ... పాపాయమ్మగారూ! మా ప్రోగ్రాం మీకంత నచ్చడానికి కారణమేంటండీ!"

"ఎందుకంటే మీరు గిఫ్టుగా ఇచ్చే చెడ్డీలన్నీ భలే బావుంటాయండీ కుసుమగారూ! ఒక వారం ఇచ్చిన చెడ్డీ మరొక వారం ఇవ్వకుండా రకరకాలుగా కలర్స్, డిజైన్స్ మారుస్తూ మాకు పిచ్చెక్కిచ్చేస్తూ ఉంటారండీ. ముఖ్యంగా త్రీ సండేస్ బేక్ నవాబుపాలెం నవ్యగారు గెలుచుకున్న చెడ్డీ అయితే సూపర్బ్ అండీ! నల్ల చెడ్డీపై ఎర్ర చుక్కల డిజైన్ మాకెంతో నచ్చిందండీ. వీలైతే అలాంటి చెడ్డీనే మాకూ గిఫ్టుగా ఇప్పించకూడదూ? ప్లీజ్ కుసుమ గారూ!"

"ఓ.. సారీ పాపాయమ్మ గారూ ఒకసారి చూపించిన చెడ్డీనే మళ్ళీ చూపించడానికి కానీ గిఫ్టుగా ఇవ్వడానికి కానీ మా రూల్స్ ఒప్పుకోవండీ. ఇప్పుడు మీరు చూస్తున్న చెడ్డీ కూడా మంచి చెడ్డీనే! పైగా ఫ్రీ సైజ్ కూడానూ! దీని కలర్స్ చూడండి ఎంత ఎట్రాక్టివ్ గా ఉన్నాయో!"

"సరేనండీ కుసుమగారూ... పోనీ ప్రశ్నైనా కొంచెం ఈజీగా అడగండి ప్లీజ్!"

"ఓకే మీరేమీ కంగారు పడకండి పాపాయమ్మగారూ...జాగ్రత్తగా ఆలోచించి జవాబు చెప్పండి. నేను మీకు హెల్ప్ చేస్తాను కూడా! మీ ప్రశ్న... ఒక చెడ్డీకి ఎన్ని బటన్స్ ఉంటాయి?"

"ఓ కుసుమగారూ... అయ్యో... చాలా కష్టంగా అడిగేసారండీ! నాకు చెడ్డీ గెలుచుకునే యోగం లేదనుకుంటాను!"

"అంతలోనే అంత డిజప్పాయింట్ అయిపోతే ఎలా పాపాయమ్మగారూ... నేను హెల్ప్ చేస్తా అన్నాగా? క్లూ ఇస్తాను కదా!"

"చాలా థ్యాంక్స్ కుసుమగారూ.... ఆ క్లూ ఏదో చెప్పండి...ప్లీజ్ ప్లీజ్!"

"మీరు చాలా టెన్షన్ పడిపోతున్నారు పాపాయమ్మ గారూ... క్లూ ఏంటంటే చెడ్డీకుండే బటన్స్ రౌండ్ ఫిగర్లో ఉంటాయి."

"రౌండ్ ఫిగర్.... అంటే...జీరోనాండీ?!!"

"వావ్ పాపాయమ్మగారూ ఇలా క్లూ ఇచ్చానో లేదో అలా చెప్పేసారు. మీరు చాలా తెలివైనవారండీ! మీలాంటి తెలివైన చురుకైనవారి కోసమే మా చెప్పుకుంటే చేటంత చెడ్డీ ప్రోగ్రాం! సూపర్బ్ ఆన్సరండీ! ఇందాకటినుండీ మన ప్రేక్షకులనందరినీ ఊరిస్తున్న ఈ రంగురంగుల చెడ్డీ ఇప్పుడిక మీ సొంతమయింది! దీపావళి సందర్భంగా స్పెషల్ గా ఆఫర్ చేస్తున్న రెండు ఎలాస్టిక్స్ కూడా గిఫ్టుగా మీరందుకుంటారు!! కంగ్రాట్స్ పాపాయమ్మ గారూ!!"

"ఓ థ్యాంక్యూ సో మచ్ కుసుమగారూ... మా ఇంట్లోనూ కాలనీలోనూ ఈ సంతోషాన్ని సెలబ్రేట్ చేసుకుంటాను! మీ చెప్పుకుంటే చేటంత చెడ్డీ ప్రోగ్రాం ద్వారా ఒక్క చెడ్డీ అయినా గెలుచుకోవాలని ఎన్నాళ్ళుగానో కలలు కంటున్నా... పైగా ఆ కలను నెరవేర్చుకోవడానికి చాన్నాళ్ళుగా చెడ్డీలు కొనడమే మానేసాను!! చాలా చాలా హ్యాపీ అండీ!! చెడ్డీలతో పాటు అదనంగా మీరు అందించిన రెండు ఎలాస్టిక్స్ బహుమతితో నాకు పట్టరాని ఆనందంగా ఉంది. ఈ సంతోషంలో నేనేమైపోతానో నాకే తెలీడంలేదండీ!! థ్యాంక్స్ ఎగెయిన్!!"

"వావ్ వెరీ నైస్ పాపాయమ్మగారూ... మీ పంతం నెరవేర్చుకున్నందుకు చెప్పుకుంటే చేటంత చెడ్డీ టీమంతా మీకు మనసారా కంగ్రాట్స్ చెబుతోంది!! అభినందనలండీ!!"

"పాపాయమ్మగారూ.... ప్రేక్షకులందరినీ కట్టి పడేస్తున్న మన పీకే కంపెనీ చెప్పుకుంటే చేటంత చెడ్డీ ప్రోగ్రాం ఇంకా ఎట్రాక్టివ్ గా చెయ్యడానికి మీరిచ్చే సూచనలేమైనా ఉన్నాయా?!"

"తప్పకుండా కుసుమగారూ... నా మనసులోని మాటను మీరే అడిగేసారు!! ఈ ప్రోగ్రాం ఇప్పటికే ఎంతో ప్రజాదరణ పొందుతోంది. ఇంకా సక్సెస్ కావడానికి నా దగ్గర కొన్ని ఆలోచనలున్నాయండీ. మొదటిది అవేంటంటే మీరు గిఫ్ట్సుగా అందిస్తున్న వైడ్ రేంజ్ లో బాగంగా కంపెనీ వారిని రిక్వెస్ట్ చేసి వర్క్ చెడ్డీలను కూడా లాంచ్ చెయ్యించండి! అదే విధంగా అందమైన బుటాలున్న చెడ్డీలూ, మా ప్రేక్షకుల స్పందన బట్టి డిజైనర్ చెడ్డీలను కూడా తయారుచెయ్యించి ఇక్కడా గిఫ్ట్సుగా అందిస్తే మన చెప్పుకుంటే చేటంత చెడ్డీ ప్రోగ్రాం ఇంకా అదిరిపోవడంతో పాటు ఛానెల్ టీఆర్పీ రేటింగ్సూ, పీకే కంపెనీ సేల్సూ, మా అందరి ఆదరణా తప్పకుండా పెరిగిపోతాయండీ!!"

"వావ్ పాపాయమ్మ గారూ ఎంత చక్కని సలహాలు ఇచ్చారండీ! మా చెప్పుకుంటే చేటంత చెడ్డీ టీం తప్పకుండా మీ అమూల్యమైన సలహాలను దృష్టిలో పెట్టుకుంటుంది. చాలా థ్యాంక్సండీ! చూసారా వ్యూయర్స్... మన పంతం పాపాయమ్మగారిలా చెడ్డీలను గెలుచుకోవాలంటే కొనకండి... జస్ట్ మా చెప్పుకుంటే చేటంత చెడ్డీ ప్రోగ్రాంకి డయల్ చెయ్యండి... మరి మరెన్నో రంగురంగుల కొత్తకొత్త డిజైన్లతో అలరించే సరికొత్త చెడ్డీల కోసం వచ్చే ఆదివారం ఎదురుచూడండి! మరోసారి మీ అందరికీ హ్యాపీ దివాలి!!"




“నాన్నా… మనం వెళ్దాం పదా, టపాకాయలు తెచ్చుకోటానికీ…” పండగ నాలుగు రోజుల ముందే పేచీ మొదలుపెట్టాడు బుజ్జిగాడనబడే ప్రణవ్.

“ఉండరా బాబూ… ఇప్పుడేనా ఆఫీసు నుంచి వచ్చానూ…” ముద్దుగా విసుక్కున్నాడు విశ్వనాథం…

“కాదు నాన్నా, టపాకాయలు తెచ్చుకోవాలా? రేపటి నుండీ అందరం ఎండలో పెట్టుకోవాలా?”

“అవును కన్నా… వెళదాంలే… ఇదిగో నీ కోసమని పదివేలు తీసుకొచ్చాను…” జేబులోంచి తీసి సరికొత్త నోట్లు చూపించాడు విశ్వనాథం…

ఆ ముందు రోజే ఏదో పని మీద వీళ్ళ ఇంటికి వచ్చి, ఆ సంభాషణ వింటున్న విశ్వనాథం ఢిల్లీ బావగారు రాజారావుకు ఒక్క క్షణం గుండె ఆగినట్టయింది.

“ఏమిటి విశూ, పది వేలా టపాకాయలకి? నీకేమైనా పిచ్చెక్కిందా?” కోపంగా అన్నారు.

చిన్నగా నవ్వి అన్నాడు విశ్వనాథం. “మీ మేనల్లుడిని అడగండి బావగారూ! ఆ విషయం గురించి వివరంగా చెబుతాడు…”

“ఊ, ఊ… అడగాల్సిందే… అడుగుదాం… ఒరేయ్ బుజ్జీ… ఇలా రా నాన్నా, మనం మాట్లాడుకుందాం…” ముద్దుగా జేబులోంచి ఫైవ్ స్టార్ తీసిస్తూ పిలిచారు రాజారావు గారు.

మెల్లగా వచ్చాడు ప్రణవ్.

“టపాకాయలు…”

“ఢిల్లీ మావయ్యా… మరేమో క్రిందటేడు పండక్కి ఏమైందంటే… రండి చెప్తా…”

ఆయన చేయి పుచ్చుకుని బాల్కనీలో ఉన్న ఉయ్యాలలో కూర్చోబెట్టి తానూ పక్కన కూర్చుని ఊగుతూ చెప్పసాగాడు.

***

'అబ్బా, నాన్న ఎన్ని టపాసులు కొనిచ్చాడో...చూస్తూ ఉంటేనే, ఎంత బాగున్నాయో...ఇక దీపావళి రోజు... ఫ్లాట్స్ లో నాదే రాజ్యమంతా... పిల్లలందరి కన్నా నేనే ఎక్కువసేపు కాలుస్తాను,   పేలుస్తాను... ఇదిగో ఇవేమో తాటాకు టపాకాయలు... ఇవేమో మతాబాలు... ఇవి పెన్సిళ్ళు, ఇవి వెన్నముద్దలు, ఇవి చిచ్చు బుడ్లు... ఇవి విష్ణుచక్రాలు, భూచక్రాలు... ఇవి కాకరపువ్వొత్తులు... ఇవేమో పాంబిళ్ళలు... ఇవిగో.. ఇవే... సీమటపాకాయలు...అమ్మో నాకు భయమే కాని, పక్కింటి రవి అన్న కాలిపిస్తానని ప్రామిస్ చేసాడుగా... ఇవిగో, ఇవి రాకెట్లు... వెలిగిస్తే ఆకాశంలోకి దూసుకుపోయి అక్కడ ఎర్రగా, పచ్చగా, పసుపుగా రంగులదీపాల్లా వెలుగుతాయట. కొత్త ఐటెం అని చెప్పాడుగా ఆ షాప్ అంకుల్... ఇవి సిసింద్రీలు...అగరొత్తి ఒకటి వెలిగించి పట్టుకుని, దాంతో ఈ సిసింద్రీ చివర పంటితో కొరికి అంటిస్తే ఉంటుందీ... ఎటు దూసుకుపోయిందో కూడా తెలియదు... వీటిని పగలు కూడా వేయొచ్చు...

అసలు పండగంటేనే   దీపావళి పండగ... అమ్మ గేటుకి రెండు పక్కలా గోడ మీద, బోలెడు దీపాలు వెలిగిస్తుంది... గేటు నుంచి ఇంటి వరకూ ఉన్న దారికి రెండు పక్కలా దీపాలు... అరుగు మీద, మెట్ల మీద... ఎన్ని దీపాలో... డాబా గోడల మీద కూడా... ఇవి కాక నాన్న ఇంటికి కరెంటుతో కూడా నక్షత్రాల లైట్లు పెట్టిస్తారు... నాకన్నింటి కన్నా ఈ పండగంటేనే ఇష్టం...నరకాసురుడిని సంహరించినందుకు, ఆ శ్రీకృష్ణుడికి, సత్యభామకి థాంక్స్ చెప్పాలి... మరందుకే కదా పండగ వచ్చింది!' తనలో తానే, మురిసిపోతూ   మూడు చాటల నిండా దీపావళి సామానులు పెట్టుకొని డాబా మీద ఎండలో కూర్చున్న బుజ్జిగాడి దగ్గరికి ఆపసోపాలు పడుతూ వచ్చింది శ్రీలక్ష్మి, వాడి అమ్మ.

"ఏమిటి కన్నా, అన్నం కూడా తినకుండా ఇక్కడ? పద పద... ఎండలో ఇలాగే నిలబడ్డావంటే... నల్లగా అయిపోతావు... మళ్ళీ పండక్కి జ్వరం వస్తుంది..." బుజ్జగిస్తూ కిందికి తీసుకుపోయింది...

"అమ్మా, ఈ సారి నాన్న చాలా కొన్నారు కదే..." మురిసాడు బుజ్జి...

"నీకూ, చెల్లికీ..." సరిచేసింది...

"అది చిన్నది కదే అమ్మా, ఏం కాలుస్తుంది? అగ్గిపెట్టెలు ఇస్తా దానికి..." తీర్మానించాడు...

"రెండేళ్ళ క్రితం దాని వయసే నీది కూడా... ఎన్ని కాల్చావో గుర్తుందిరా నీకు?" నవ్వేసి, "దగ్గరుండి, చెల్లికి భయం పోయేలా అన్నీ

కాలిపించాలి మరి... సరేనా?" తలనిమిరి చెప్పింది.

అయిష్టంగా తలూపాడు బుజ్జి.

ఆ సాయంత్రం చెల్లిని వెంటబెట్టుకొని దీపావళి సామాన్లు తెచ్చుకోవటానికి మళ్ళీ డాబా మీదికి వెళ్ళాడు బుజ్జి. వాళ్ళ వెనకాలే వచ్చాడు పనిమనిషి కొడుకు నారి.

"బుజ్జి బాబూ, ఇయన్నీ దీపాల పండక్కి మీరు కాలుత్తారా?" విప్పారిన కళ్ళతో టపాసులను చూస్తూ అడిగాడు సంభ్రమంగా బుజ్జిని.

"అవును... మా నాన్న మాకిద్దరికీ కొనిచ్చాడు... కద చెల్లాయ్?" గర్వంగా అన్నాడు బుజ్జి.

"బుజ్జి బాబూ, ఇయన్నీ ఏటో, ఆటి పేర్లేటో సెప్పరా?" ఆసక్తిగా అడిగాడు నారి.

అంతే బుజ్జికి వీరావేశం వచ్చేసింది... ఒక్కోదాన్ని చూపిస్తూ అది ఎలా వెలుగుతుందో, ఏయే రంగుల కాంతుల్ని వెదజల్లుతుందో, ఎలా పేలుతుందో... ఎంత దూరం దూసుకు పోతుందో... వివరంగా చెప్పాడు. చెల్లి చేత ఏమేం కాల్పించాలని అనుకున్తున్నాడో, తానేమి కాలుస్తాడో, రవి అన్నతో ఏమేం కాల్పించుకుంటాడో కూడా చెప్పాడు...

అన్నీ చెప్పి, "నారీ, మీ అమ్మా నాన్నా ఇవన్నీ కొంటారా నీక్కూడా?" అని అడిగాడు అమాయకంగా...

"ఊహు..." నారి ముఖంలో నిరాశ...

"దీపాల పండక్కి ఏం కొనమన్నా... డబ్బులే లేవని అంటారు..." దిగులుగా అన్నాడు నారి.

“అవునా?” ఆలోచనలో పడ్డాడు బుజ్జి…

“బుజ్జి బాబూ… నీ టపాసులు చాలా బాగున్నాయ్…” చెప్పాడు నారి వాటి వైపే ఆశగా చూస్తూ…

బుజ్జికి దిగులుగా అనిపించింది.

***

“నాన్నా… మరేం… మన నారికి టపాకాయలు, కొత్తబట్టలు లేవంట… మనం కొనిద్దామా?”

“నారి ఎవర్రా?”

“అదేనండి… మన పనమ్మాయి పద్దూ కొడుకు… అదీ, దాని మొగుడూ ఎంత కష్టపడినా ఇంటి ఖర్చులకే సరిపోవు… ఇక పండగలు ఏం చేస్తారు? ముఖ్యంగా ఈ దీపావళి పండక్కి పిల్లలకే కదా సరదా అంతా… నిన్న నారిగాడు వాళ్ళమ్మతో వచ్చి ఈ టపాసులు అన్నీ చూసాడట… వీడు అప్పటినుంచి వాడికి సగం ఇచ్చేస్తానని అంటున్నాడు… చెల్లితో పంచుకోవటానికే ఇష్టపడడు, అలాంటిది, నారిని చూస్తే వీడికి చాలా బాధ కలిగిందట…” చెప్పింది శ్రీలక్ష్మి.

“అవునా? బుజ్జీ… అయితే సరే… నీకొక మంచి మాట చెబుతాను… వింటావా?”

“చెప్పు నాన్నా…” ఉత్సాహంగా అన్నాడు బుజ్జి.

“మనం నారికి కొత్త బట్టలూ, టపాకాయలు తప్పకుండా కొందాం. అలాగే నీ పుట్టినరోజు మార్చి నెలలో వస్తుంది కదా… అప్పుడు నువ్వేం సెలబ్రేట్ చేసుకోకుండా, పార్టీలు ఇవ్వకుండా ఉంటే, ఆ ఖర్చు మొత్తం పదివేలు పెట్టి టపాకాయలు కొనిస్తాను. అవన్నీ, నారిలాంటి పిల్లలకి, అనాథ శరణాలయాలలో ఉండే పిల్లలకి ఇద్దాం… బట్టలు కూడా కొనిద్దాం… నీకలా ఇష్టమేనా?”

“ఓ… అవును నాన్నా… పాపం అనాథలకి అమ్మా, నాన్నలు ఉండరు కదూ? మనమే కొనిద్దాం… నేను పుట్టినరోజుకు ఏమీ అడగనుగా!”

“అయితే ఒక కండిషన్… నువ్వు చక్కగా చదువుకోవాలి… టీవీ చూసే టైము తగ్గించేసి, మంచి మార్కులు తెచ్చుకోవాలి…”

“ప్రామిస్ నాన్నా… అలాగే చేస్తాను… మరిప్పుడు నారిగాడికి…”

“అలాగేరా… నేను వాడికి విడిగా కొనిస్తాను… నువ్వు, చెల్లీ ఇవి ఉంచుకోండి… సరేనా?” నవ్వాడు విశ్వనాథం.

***

“అలా మా నాన్నారు చెప్పారు కదా ఢిల్లీ మామయ్యా… అందుకని నేను నా బడ్డే చేసుకోలేదు… కొత్తబట్టలేసుకుని గుడికి వెళ్ళి వచ్చా అంతే… ఆ డబ్బులన్నీ కలిపి ఈరోజు మేము టపాకాయలు కొని తెచ్చి, ‘అమ్మ ఒడి’ హోమ్ లో ఇచ్చి వస్తాము రేపు…” మెరిసే కళ్ళతో చెప్పాడు బుజ్జి.

రాజారావుగారి కనుకొలకులలో నీళ్ళు నిలిచాయి…

“విశూ… ఎంత గొప్ప సంస్కారమయ్యా మీది… మంచి మనసుతో ఇంత ప్రేమను పంచుతున్న మీరు నిజంగా ధన్యులు…” లేచి వచ్చి విశ్వనాథం భుజం తట్టి చెప్పారు.

“ఢిల్లీ మామయ్యా…దీపావళి పిల్లల పండగ కదా… మరి అందరు పిల్లలూ టపాకాయలు కాల్చుకోవాలి కదా… అందరికీ డబ్బుంటే అందరం కాల్చుకోవచ్చు… పాపం డబ్బులేని వాళ్లకి మనం కొనిస్తే వాళ్ళూ కాల్చుకుంటారు… మా నాన్న మంచి ఉపాయం చెప్పారు కదూ…” అన్నాడు బుజ్జి.

“అవునురా... అందరం కలిసి అన్నం తిన్నప్పుడు, కలిసి సంతోషాన్ని పంచుకున్నప్పుడే నిజమైన పండుగ... మీ నాన్న ఆ పండుగను కనుల ముందుకు తేసుకువస్తున్నాడు... నిజమైన దీపావళి అంటే ఏమిటో తెలిసిందిరా... ఇదిగో... విశూ... నేనో ఐదువేలు ఇస్తున్నాను... ఆ పండుగలో నాకూ భాగం పంచరా ...” అన్నారు రాజారావుగారు.

“ఢిల్లీ మామయ్యా... మీరు చాలా గ్రేట్... థాంక్ యు థాంక్ యు... అందరి మామయ్యలూ, బాబాయిలూ, పెదనాన్నలూ ఇలాగే డబ్బులివ్వాలి...అప్పుడు మా పిల్లలకందరికీ పెద్ద దీపావళి పండుగ!” అంబరాన్నంటే సంబరంతో చెప్పాడు బుజ్జి.




కొంపదీసి ఆ శ్రీనివాసుడి కల్యాణం అనుకుంటున్నారా! అబ్బే కాదు. ఇది మా శీను గాడి కల్యాణం. మరీ హెడ్డింగే శీను గాడంటే బాగుండదని. ఇంతకీ శీను గాడెవరో చెప్పాలిగా. మా పిన్ని కొడుకు. ఉత్తర భారతదేశంలో పని చేస్తున్నాడు. పని చేస్తున్న వాడు తిన్నగా ఉండక ఒక పంజాబి అమ్మాయిని లవ్వాడాడు. అంటే ఘాటుగా ప్రేమించాడన్న మాట. నీవు తప్ప ఇహఃపరంబు లెరుగన్ అన్న స్టైల్లో ఆ అమ్మాయిని తప్ప ఎవర్నీ పెళ్ళాడనని ఒక అల్టిమేటమ్ ఇచ్చాడు మా పిన్నికి. పాపం తల్లి ప్రాణం కదా! పిల్లవాడు బ్రహ్మచారిగా ఉండి పోతాడో లేక బెండకాయలా ముదిరి పోతాడో అని తెగ భయపడి పోయింది. మా బాబయ్య ఇవన్నీ జాంతా నై అన్నారు.

“వెధవ్వేషాలు వెయ్యొద్దని చెప్పు. నేను చూసిన పిల్లనే చేసుకోవాలి. లేకపోతే వాడి......అంటూంటే ఆయన నోటంబడి వచ్చే మంత్రాలు వినడం ఇష్టం లేని మా పిన్ని ఆయన నోటికి తన చెయ్యి అడ్డం పెట్టింది.

“ అంతగా ఆ అమ్మాయినే చేసుకోవాలన్న పట్టుదలేమిటిరా అని” అడిగాను నేను ఊరుకోలేక.

“నాన్నగారి ఉద్యోగ రీత్యా నేను హిందీ మాట్లాడే చోటే ఉన్నాను. నాకే సరిగ్గా తెలుగు రాదు. ఆంధ్రాలో పుట్టి పెరిగిన అమ్మాయితో నేను ఎడ్జెస్ట్ అవలేనురా” అన్నాడు.

వెంటనే నాకో డౌట్ అనుమానం వచ్చేసింది అలా ఐతే అమెరికాలో ఉన్ నవాళ్ళందరూ అమెరికా అమ్మాయిల్నే పెళ్ళి చేసుకోవాలా? అలా ఐతే పాపం మన ఆంధ్రాలో పెరిగిన అమ్మాయిలకు పెళ్ళిళ్ళు కావా? అని. ఈ నా అనుమానం మా అమ్మ విందంటే భడవా నీకన్నీ ప్రశ్నలు, అనుమానాలే అని అంటుంది.

మొత్తానికి వాద వివాదాల తరువాత అతి కష్టం మీద శీను గాడి పెళ్ళి కుదిరింది. మా బంధువులంతా ఈ కొత్ తరకం పెళ్ళి ఎలా జరుగుతుందన్న ఆత్రుతతో పెళ్ళి గురించి వాళ్ళకు తోచిన రీతిలో తెగ కలలు కనేసారు. అత్తయ్యేమో పెళ్ళిలో గొడవలవుతాయంటావా? అన్న అనుమానం వ్యక్తం చేసింది. ఆవిడ ఉద్దేశంలో ఏ పెళ్ళిలోనూ మగ పెళ్ళి వారు గొడవ చెయ్యకుండా ఉండరన్న ఉద్దేశం. వాళ్ళు మనకు మర్యాదలు సరిగ్గా చేస్తారంటావా? అన్న అనుమానం. మొత్తానికి మా శీను గాడి పెళ్ళి ఇంట్లో పెద్ద చర్చకు నాంది పలికింది.

మా మావయ్యకు మరి కొంత మందికి అర్జెంట్ గా పంజాబీ భాష నేర్చుకోవాలన్న కోరిక పుట్టింది. వీళ్ళకసలు హిందీనే సరిగ్గా రాదు. ఇంక పంజాబీ గురించిన తాపత్రయం ఎందుకో నాకర్థం కాలేదు. పెళ్ళిలో వీళ్లు ఎవరితో మాట్లాడాలి కనక. పెళ్ళికి వెళ్ళే లోపల నేర్చుకోవాలి? ఎలాగా? మా అత్త కూతురు దానికి ఇంటర్నెట్ పిచ్చి. అస్తమానూ గూగుల్లో ఏదో ఒకటి వెతుకుతూ ఉంటుంది.

“ఇంచక్కా మన అనుమానాలన్నీ గూగులమ్మ తీరుస్తుంది తెలుసా?” అంటూ. అందరికీ అమ్మ తగల్చడం దానికి ఆనందం. సావిత్రమ్మ, జమునమ్మ అంటూ. పెళ్ళి కావాల్సిన పిల్లవు అంతసేపు కంప్యూటర్ మీద కూర్చుంటే నీకు సోడా బుడ్డి కళ్ళద్దాలు వస్తాయే అంటుంది నాన్నమ్మ. ఇనా అది వినదు.

“మీ అందరికీ పంజాబీ నేర్చుకోవాలని ఉంది కదా! నేను నేర్పుతాను”. అంది. అంతే అందరూ దాని చుట్టూ మూగిపోయారు. అది అందరికీ వరాలిచ్చే భంగిమలో “మీరందరూ ఈ రోజు నించి నా శిష్యులు” అంటూ.

దీని పాండిత్యం అంతా గూగుల్ ట్రాన్సిలేషన్ నించి అందులో ఎన్ని తప్పులుంటాయో పరమాత్ముడికే ఎరుక. పిన్ని, బాబయ్య ఢిల్లీలో ఉంటున్నారు. వాళ్ళకు హిందీ బాగానే వచ్చు. కుర్ర కారుకు, కొంత మంది పెద్దలకు ఇంగ్లీష్ వచ్చు. పెళ్ళి రెండు రోజులూ మానేజ్ చెయ్యవచ్చు.

మా మావయ్య గారు కొంత కాలం అంటే సుమారు ఒక ఏడాది నార్త్ లో పని చేసారు. ఆయన ఆ ఏడాదిలోనే హిందీలో ప్రావిణ్యం సంపాదించాననుకుంటారు.

ఒక సారేమయ్యిందంటే ఒక టాక్సీ డ్రైవర్ తో ఒక అరగంట మాట్లాడి వచ్చి, “చూసావా నా భాషా ప్రావీణ్యం. వాడికి దిమ్మ తిరిగి పోయింది. నాకు హిందీ రాదని టోకరా ఇద్దామనుకున్నాడు” అంటూ ఒక చిరు మందహాసం పారేసారు. తానేదైనా చక్కని పని చేసాననిపించినప్పుడు అందమైన నవ్వొకటి ఆయన మొహంలో చోటు చేసుకుంటుంది.

ఈ ముక్క చెప్పి ఆయన లోపలికి వెళ్ళగానే ఆ డ్రైవర్ పరుగెట్టుకుంటూ వచ్చి, “ సాబ్ క్యాబోల్ రహెహై ముఝె బిల్ కుల్ సమఝ్ నహీ ఆయా ( ఆ పెద్ద మనిషి ఏం మాట్లాడారో నాకు ఒక్క ముక్క కూడా అర్ధం కాలేదు) నేను వంద అంటే ఆయన ఐదు వందలు ఇచ్చారు. ఎంత చెప్పినా అర్ధం చేసుకోరు. ఇదిగో మీ నాలుగొందలూ అన్నాడు.

సరే అని ఆ డబ్బులు తీసుకుని మావయ్య దగ్గరకు వెళ్ళాను. ఆ టాక్సీ వాడు నాలుగొందలు వెనక్కి ఇచ్చాడు మావయ్యా వాడసలు నిన్ను ఎంత అడిగాడు?” అన్నాను.

“ వాడు సౌ అని అడిగాడు అది చాలా ఎక్కువ కదరా. అందుకని ఐదు వందలిచ్చి వాడిని వదిలించుకున్నాను”.

“మావయ్యా సౌ అంటే వంద నువ్వు వాడికి ఐదు వందలిచ్చావు. నువ్వు సౌ ని వెయ్యనుకున్నావు కదూ! అందుకే వాడడిగిన దానిలో సగం ఇచ్చానని మురిసి పోయావు. వాడు మంచి వాడు కాబట్టి న్యాయంగా నీ డబ్బులు నీకు వెనక్కి

ఇచ్చాడు” అన్నాను. మావయ్యకు తన పొరపాటు తెలిసింది. తన హిందీ ప్రావీణ్యం ఇలా బట్ట బయలు అయినందుకు బాధతో “సరే ఎదో పొరపాటు పడ్డాను. ఇది ఇంతటితో మర్చిపో” అన్నారు. నేను నవ్వుకుంటూ బైట పడ్డాను. అమ్మ మావయ్యా ఇదా నీ

హిందీ ప్రావీణ్యం అనుకుంటూ.

పెళ్ళి రోజు దగ్గరికి వచ్చింది. అందరం ఢిల్లీ ప్రయాణం అయ్యాము. హైద్రాబాద్ నించి ఢిల్లీకి ఎ.పి. ఎక్స్ ప్రెస్ లో ప్రయాణం. అందరం సరదాగా నవ్వుతూ, కబుర్లు చెప్పుకుంటూ పాటలు పాడుకుంటూ ఒక పిక్నిక్ లా ఇంటి నించి తెచ్చుకున్న పలహారాలు భుజిస్తూ ఆనందంగా గడిపాము. ఇరవై ఆరుగంటల ప్రయాణం కదా!

స్టేషన్ కు పిన్నీ, బాబయ్యా వచ్చారు. అందరికీ కలిపి ఒక మినీ బస్ అరేంజ్ చేసారు. అందరూ దేశ రాజధానికి వచ్చామన్న ఆనందంలో బస్ కిటికీ లోంచి పరిగెడుతున్న వాహనలను, మనుష్యులను, రోడ్లను చూడ్డంలో మునిగి పోయారు. మా కోసం వాళ్ళ అపార్ట్ మెంట్ ప్రాంగణంలోనే ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారు పిన్నీ, బాబయ్య. అన్ని గదుల్లో పరుపులు వేయించారు. ఒక వంట వాడిని పెట్టారు. మాకెవరికేం కావాలో చెప్పి చేయించుకోవడమే. సదుపాయాలు చాలా బాగా ఉన్నాయి. నవంబర్ నెల చిరు చలిగా ఉంది.

మా అత్తయ్య కూతురు చుట్టూ మూగి దీనికేమంటారు ఈ మాట కర్థం ఏమిటి అంటూ దాని బుర్ర తినడం మొదలు పెట్టారు. అందరూ ఇప్పుడు పంజాబీ, హిందీ భాషల్లో ప్రావీణ్యం సంపాదించే హడావుడిలో ఉన్నారన్న మాట. వీళ్ళు ఇలా తంటాలు పడుతుంటే ఒక పద్దెనిమిదేళ్ళ అమ్మాయి మా ఫ్లాట్లోకి అడుగు బెట్టింది. “నా పేరు అల్కా నేను శీను భయ్యాకి బెహన్ని” అంటూ.

మా పెద్ద వాళ్ళకు కొంత మందికి అనుమానాలు ఈ అమ్మాయి వాడికి ఎలా చెల్లాయ్ అని. ఆ అమ్మాయి శీను గాడికి రాఖీ కడుతుంది. పిన్నికి దత్త పుత్రిక. చాలా చనువుగా ఉంటుంది. బాబయ్యకు ఆడపిల్లలు లేరు. ఆ ముచ్చట ఈ అమ్మాయి ద్వారా తీర్చుకుంటున్నారు. ఇదంతా పిన్ని ద్వారా తెలిసిన సమాచారం.

“మీరిక్కడ ఉన్నన్నాళ్ళూ మీకేం సహాయం కావాలన్నా నేనున్నాను” అంది. ఆ అమ్మాయి పంజాబీ అని తెలియగానే మా వాళ్ళందరూ పంజాబీ నేర్పమని ఆ అమ్మాయి చుట్టూ మూగారు.

“కానీ ఒక కండిషన్ నాకు మీరు తెలుగు నేర్పండి. నేను మీకు పంజాబీ నేర్పుతాను” అంది.

ఇంకేముంది అందరూ ఏక కంఠంతో సరే అన్నారు. ఆ అమ్మాయి దగ్గర నీ పేరేమిటి? నమస్కారం అనడానికి ఏమంటారో

రాసుకున్నారు. ఈ లోపల భోజనాలకు పిలుపు వచ్చింది. కొంత మంది బాల్కనీలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఈ అమ్మాయికి ఒక ఆలోచన వచ్చింది. " నేను బాల్కనీలో ఉన్న వాళ్ళను భోజనానికి రమ్మని తెలుగులో పిలుస్తాను. ఏమంటారో చెప్పండి" అంది.

"ఓ తప్పకుండా అంటూ ఏమనాలో ఆ అమ్మాయికి చెప్పారు. ఆ అమ్మాయి బాల్కనీలోకి వెళ్ళి "మీరు తంతారా?" అని అడిగింది.

బాల్కనీలో ఉన్న వాళ్ళు ముందు నిర్ఘాంత పోయి తరువాత "ష్యూర్" అని ఫక్కున నవ్వడం మొదలు పెట్టారు.

వాళ్ళ నవ్వుతో ఆ అమ్మాయికి అనుమానం వచ్చి, "క్యాహువా?" (ఏమైంది) అని అడిగింది. ఆమె వెనకాతలే వెళ్ళిన నేను అంతా విని నవ్వు ఆపుకోలేక పోయాను. అప్పుడు చెప్పాను. " ఎమీ అవలేదు. నీకు చెప్పినది భోజనం తింటారా" అని అడగమంటే దాన్ని చిన్నది చెయ్యడంలో మీరు తింటారా అనబోయి తంతారా" అన్నావు. దాని అర్ధం "విల్ యూ కిక్ మీ" అని తింటారా అల్లా తంతారా అయ్యే సరికి అర్ధం మారిపోయింది అని వివరించాను. విషయం విన్న అల్కా ముందు చిన్నబోయినా తరువాత తను కూడా నవ్వేసింది

బస్సులో పెళ్ళికి చండీఘర్ బయలు దేరాము. మా వాళ్ళందరూ వాళ్ళు నేర్చుకున్న పంజాబీ మాటలు వల్లె వేస్తున్నారు.

' సస్రియకాల్' (నమస్కారం)         త్వడకీనామ్ (నీపేరేమిటి) అని అందరి నోళ్ళు ఉచ్చరిస్తున్నాయి. మా పిన్ని టైమ్ లేక బస్ లో ఎక్కాక గోరింటాకు పెట్టుకుని కళ్ళు మూసుకుని పడుకుంది.

"త్వడకీనామ్" అల్లా" తొడనాకీ" అని వినిపించటం మొదలు పెట్టింది.

" తొడనాకటం ఏమిటిర్రా మీ అందరికీ తిక్క రేగిందా?" అని ఒక్క అరుపు అరిచారు పెద్ద నాన్న. అందరూ నోరు మూసుకున్నారు. నాకు, బాబయ్యకు నవ్వు ఆగలేదు. అల్కాకు అర్ధం కాలేదు మేం ఎందుకు నవ్వుతున్నామో!

మేం బస్ దిగగానే పెళ్ళి వారు దండలతో స్వాగతం పలికారు. పెద్ద నాన్నకు, బాబయ్యకు అందరికీ వాళ్ళ వాళ్ళ వరసలను

బట్టి పగిడీ(తలపాగా) లు తెచ్చి ధరించమన్నారు. అందరికీ శాలువాలు కప్పి వెండి కాయిన్స్ ఉన్న డబ్బాలు చేతిలో పెట్టారు. అరేంజ్ మెంట్స్, మర్యాదలు చాలా బాగున్నాయి.

అందరూ పెళ్ళి కోసం తయారవుతుంటే మా పెద్ద నాన్న పరుగు పరుగున వచ్చి “వీళ్ళకి సభ్యతా, సంస్కారం బొత్తిగా లేవురా. శీను గాడికి ఇంత కన్నా మంచి అమ్మాయి దొరకదనుకున్నాడా?” అంటూ మొదలు పెట్టారు.

బాబయ్య మొహంలో గాభరా ఏమయ్యిందో అని. “ ఏమయ్యిందో వివరంగా చెప్పన్నయ్యా నేను కనుక్కుంటానుగా” అన్నాడు.

“కాదురా శీను గాడ్ని చూపించి అస్తమానూ ముండ ముండ అంటున్నారు. చెట్టంత పిల్ల వాడు అందులో పెళ్ళి కొడుకును అలా అనడం ఏమైనా భావ్యంగా ఉందా!” అన్నారు పెద్ద నాన్న.

ఆ మాటలు విన్న బాబయ్య “ అన్నయ్యా ఇందులో అంత బాధ పడవలసినది ఏమీ లేదు. పంజాబిలో ముండ అంటే మగ పిల్లవాడని అర్ధం. మన శీను గాడు చెంగా ముండా అని అస్తమానూ అనుకుని మురిసి పోతున్నారు. అంటే మంచి

పిల్లవాడని అర్ధం. హిందీలో ఒక సామెత ఉంది ” ఏక్ దేశ్ కీ బోలీ ఏక్ దేశ్ కీ గాలీ” అని. ఒక చోట మంచి మాట ఇంకో చోట తిట్టు కింద వస్తుంది. మన భారతదేశంలో వివిధ భాషలూ ఉన్నాయి. మన తెలుగులోనే జిల్లా మారితే కొన్ని మాటలకు అర్ధాలు మారి పోతాయి. పెద్ద వాడివి నీకు నేను చెప్పాలా?” అన్నాడు.

పెద్ద నాన్న కోపంగా రావడం చూసిన ఆడ పెళ్ళి వారు వాళ్ళ మూలంగా ఏం పొరపాటు జరిగిందో అని పరుగెట్టుకుని వచ్చారు. భయంగా నించుని మా వైపు చూస్తున్న వాళ్లతో బాబయ్య వాళ్ళకు అంతా వివరించారు.

“ మేం మన్నించడానికి రండి అన్న పదం వాడితే అది మీకు తప్పు మాట కాబట్టి మీకు బాధగా ఉండి మా వాళ్ళ మీద కోపం తెచ్చుకుంటారు. మీ భాషలో రండి అన్న పదానికి మా భాషలో ముండ అన్నది సమాన పదం. మీకు మా పదం ఎంత తప్పో మాకు మీ పదం కూడా అంతే తప్పు. ఇప్పుడు అందరూ ఒకటే కాబట్టి ఎవరి భాషనూ తప్పు అర్ధం చేసుకోకుండా పెళ్ళి సరదాగా ఎంజాయ్ చేద్దాము” అన్నాడు బాబయ్య.

మొత్తానికి మా శ్రీనివాసుడి కల్యాణం ఆనందంగా సాగింది బారాతీలో మా పెద్ద నాన్న కూడా డాన్స్ చేసారు.

చివరగా చిన్న చెణుకుః-- మా శీను గాడికి హైద్రాబాద్ ట్రాన్స్ ఫర్ అయ్యింది. ఒక రోజు వాడు ఆఫీస్ నించి వచ్చే సరికి వాడి శ్రీమతి ఏడుస్తూ కనిపించింది. అసలే కొత్త పెళ్ళాం ఏమయ్యిందో అన్న గాభరా వాడిలో.

“ఏమయ్యింది స్వీట్ హార్ట్” అని అడిగాడు.

“ మీ దేశం వాళ్ళకు అస్సలు బుద్ధి లేదు ఏం మాట్లాడాలో తెలీదు” అంది

“ అసలేమైందో చెప్పు నన్ను సస్పెన్స్ లో పెట్టకు అన్నాడు. నేను ఫోన్ చేసిన ప్రతీ సారి మా అమ్మను రండి” అంటున్నాడు. ఇదేం మాట నాకు చాలా కోపం వచ్చి వాడ్ని చెడా మడా తిట్టాను” అంది. వాడికి ఈమె తిట్లు వినపడవుగా

ఒక్క నిముషం అర్ధం కాలేదు. వాళ్ళమ్మను ఫోన్ వాడు ఎందుకు తిడతాడు? అది రికార్డెడ్ మెసేజ్ కదా! అని ఈసారి వచ్చినప్పుడు ఫోన్ నాకు ఇయ్యి అన్నాడు. భోజనాలకు అరేంజ్ చేస్తుండగా వాడికేదో ఫోన్ వచ్చింది. ఆ ఫోన్ తరువాత “ టాటా డకోమా కుమారండి(మా రండి) అన్న పదం విని వాడికి నవ్వాగ లేదుట. వాడెందుకు నవ్వుతున్నాడో అర్ధం కాక తెల్ల మొహం వేసింది కొత్త పెళ్ళి కూతురు. ఆ తరువాత వాడు ఆ అమ్మాయికి వివరించాడన్న విషయం నేను చెప్పక్కర లేదుగా.

ఇదంతా నాకు ఫోన్ లో వాడు చెపితే నేను నవ్వ లేక చచ్చాను. కధ కంచికి మనం ఇంటికి.




రాము వార పత్రిక చదువుతూ వున్నాడు. ఒక పేజి దగ్గర తన ఆలోచనలు ఆగిపోయాయి. ఆ పేజి లో సాహస కథల పోటీ కి ఆహ్వానం అని వుంది. తను వృత్తి రీత్యా కంప్యూటర్ ఇంజినీర్. వారం రోజులు పని ఒత్తిడిలో నే గడిచిపోతుంది. వారాంతం కుటుంబం తో సరిపోతుంది. తన కోసం కొద్దిగా సమయం దొరికితే ఎంతో ఇష్టం అయిన పుస్తక పఠనం కి కేటాయిస్తాడు. జీవిత భాగ్య స్వామి సౌమ్య కాఫీ కప్ తో అక్కడకి వచ్చింది. "ఏంటి సారు దీర్ఘాలోచన లో వున్నారు?" పక్కన కూర్చుంటూ అంది. తను చదువుతున్న పత్రిక సౌమ్య చేతికలో పెట్టాడు. చాలా రోజుల నుంచి వార పత్రిక కి కథ రాద్దాం అనుకుంటున్నాను. "ఈ పోటీ తో మొదలు పెడితే ఎలా వుంటుంది?" సౌమ్య కళ్ళలోకి చూస్తూ అన్నాడు. "ప్రతీ సోమవారం పొద్దున నుంచి శుక్రవారం సాయంత్రం దాకా మీ ప్రాజెక్టు పనుల తో చేస్తున్న సాహసం గురించి రాస్తారా?" నవ్వుతూ సమాధానం చెప్పింది.

మార్నింగ్ వాక్ పూర్తి చేసుకొని అప్పుడే రాము అమ్మ, నాన్న గిరీశం, వసుంధర వచ్చారు. "మీ అబ్బాయి సాహస కథ రాస్తారు అట!" నవ్వుతూ వాళ్ళ తో అంది. సౌమ్య చేతిలోంచి వార పత్రిక ని తీసుకొని అక్కడే కూర్చొన్నాడు గిరీశం. కాఫీ తీసుకొస్తాను అని సౌమ్య అక్కడ నుంచి లోపలకి వెళ్లింది. సౌమ్య వెనుకే వసుంధర కూడా కిచెన్ వైపు నడిచింది. మంచి ఆలోచనే! కానీ దీని గురించి నీకు అనుభవం లేదు కదా! ఎవరివైనా సాహస కథలు చదువు. లేదంటే అలాంటి వాళ్ళని ఎవరినైనా పర్సనల్ గా కలిసి వాళ్ళ అనుభవం గురించి తెలుసుకుంటే మరీ మంచిది. గిరీశం తన కొడుక్కి సలహా ఇచ్చాడు. అలాగే ఆలోచిస్తాను అని రాము సమాధానం చెప్పాడు.

మళ్ళీ సోమవారం మొదలు. ప్రాజెక్టు పని లో మునిగిపోయాడు రాము. కథ గురించి ఎంత ఆలోచిస్తున్నా కొత్తగా ఏమి ఆలోచన

రావడం లేదు. పని లో పడి అస్సలు ఆలోచించడమే కుదరడం లేదు. ఆఫీసు లో లంచ్ చేస్తూ వున్నాడు. తన వెనుకే కూర్చున్న నలుగురి మాటలు విని వాళ్ళ వైపు చూసాడు. తనకు పరిచయస్తులే, ఈ వీకెండ్ ఏదో ట్రిప్ గురించి ప్లాన్ చేసుకుంటున్నారు. ఒక కొండ ని ఎక్కడానికి స్కెచ్ వేస్తున్నారు. వాళ్ళ మాటల్ని వింటుంటే ఒకటి అర్ధం అవుతోంది. ఆ కొండ ఎత్తులో చిన్నదే. కాని ప్రమాదం లో చాలా పెద్దది. వందేళ్ళు గా ఎవరూ దాన్ని ఎక్కలేదు. దాని చరిత్ర భయపెడుతుంది. అస్సలు ఆ చరిత్ర నిజమా కాదా అని ఎవ్వరూ ట్రై చేయలేదు అనేది విచిత్రమే. అయిదుగురు వెళ్లడానికి ఒక దళారి కి డబ్బులు కట్టేసారు. వాళ్ళలో ఒకరు ఇప్పుడు డ్రాప్ అంటున్నాడు. కట్టిన డబ్బులు వృధా అని వీళ్ళు బాధ పడుతున్నారు.

రాము వాళ్ళని చూస్తూ అలానే కూర్చున్నాడు. రాము ఇంట్లో వాళ్ళతో తన మనస్సులో మాట చెప్పాడు. అందరూ చుట్టూ నిలుచున్నారు. సౌమ్య కళ్ళు ఏడ్చి ఏడ్చి చాలా ఎర్రగా వున్నాయి. పుస్తకాలు చదవమని చెప్పాను. ఎవరైనా కొండలు ఎక్కిన వాళ్ళ దగ్గర ఇన్ఫర్మేషన్ తీసుకోమన్నాను. నిన్నే ఈ సాహసం చేసి స్వీయ అనుభవం తెచ్చుకొని కథ రాయమని చెప్పలేదు. మా అందరికీ నువ్వే అన్నీ. ఇద్దరు పిల్లల్లో ఒకటి ప్రేమ కోసం గుండెల్లో తన్ని వెళ్లిపోయింది. ఈ వయస్సులో నీ పైనే మా ఆశలన్నీ, నీ ఆశయం కోసం ఏడిపించకు. ఈ పిచ్చి ఆలోచనలు మానుకో అని గట్టిగా చెప్పాడు గిరిశం. నా దృష్టి లో కథ అంటే జీవితం. నా తొలి కథ వేరే వాళ్ళ జీవితం లోంచి కాకుండా నా జీవితం లోంచి పుట్టింది అయితే బాగుంటుంది అనేది నా నమ్మకం అన్నాడు రాము. కథ అంటేనే కల్పన. ఊహించి ఏదైనా రాసుకోండి. మిమ్మల్ని ఆ కొండలెక్కుతాను, సముద్రం ఈదుతాను అంటే ఒప్పుకొనేదే లేదు అని ఏడుస్తూ అంది సౌమ్య.

ఆ కొండకి దెయ్యాల కోన అని పేరు. మా నాన్న నాకు ఆ కొండ మీద జరిగిన విషయాలు నా చిన్నప్పుడు కథలు కథలు గా చెప్పేవాడు. అక్కడకి వెళ్లడానికి వీల్లేదు అంటూ బోరుమంది అమ్మ వసుంధర. ఈ సాహసాలు కథల్లో చదవడానికి, టివి లో చూడ్డానికి బాగుంటాయి. మన ఇంటిలోనే జరగడానికి మేము ఒప్పుకోము అని కుటుంబం మొత్తం వ్యతిరేకించింది.

దెయ్యాల కోన కి పది మైళ్ళ దూరం లో వుంది ఒక కుగ్రామం. ఆ గ్రామం లో కొందరు మాత్రమే కర్ర పుల్లలు ఏరుకోడానికి కొండ మొదలు దాకా వెళ్తుంటారు. కొండ పై నుంచి భయంకరమైన అరుపులు వినిపిస్తుంటాయి. రకరకాల ధ్వనులు ప్రతిధ్వనిస్తుంటాయి. ఆ గూడెం దొర చెప్తూ వుంటే ఆశక్తి గా వింటున్నాడు రిషి, శ్వేత, జాన్, షీనాలతో కూర్చున్న రాము. ఆశయం కోసం వచ్చేసాను. మొదటి సారి నాన్న మాట కాదని నా మాట కోసం వచ్చేసాను. మొదటి సారి నా వైఫ్ కన్నీళ్లని దాటేసి నా ఆశయం కోసం అడుగేసాను. నేను అడుగేసిన ఈ ప్రయత్నం వీళ్ళ మాటల్లో భూతం లా కనిపిస్తుంది. అయినా భయం కలగడం లేదు. సాహసం చెయ్యాలి అనుకున్న వాడికి వుండకూడని తొలి లక్షణం భయం. వుండవల్సిన లక్షణం గుండె ధైర్యం. ఈ సాహస యాత్ర విజయవంతం గా పూర్తి చేసి. నా తొలి కథ ని నా కుటుంబానికి అంకితం చేసే అవకాశాన్ని కల్పించమని ఆ భగవంతుని కోరుకుంటున్నా. ఇలా తనతో తెచ్చుకున్న పుస్తకంలో రాము చేతి నుంచి అక్షరాలు పరిగెడు తున్నాయి. వేకువ జాము తొలి ఘంటకే పయానం. సిద్ధం గా వుండండి. మా మనిషి కొండ మొదలు దాకా తోడొస్తాడు. అక్కడ నుంచి మీ దారి మీదే. మీకు ఇంకా ఆలోచించకోడానికి టైమ్ వుంది. వెనక్కి వెళ్ళి బ్రతికిపోతారో , పైకి ఎక్కడానికి వెళ్ళి పైకే పోతారో ఆలోచించుకోండి. గూడెం పెద్ద మాటలు భయపెట్టాయి. శ్వేత, షీనాలు రిషి, జాన్ ల చేతులు గట్టిగా పట్టుకొని గుండెల్లో ధైర్యం నింపుకున్నారు. పుస్తకం

గుండెలకు హత్తుకొని తన ఆశయాన్ని గుండెల్లో నింపుకున్నాడు రాము.

అడుగులు మెల్లగా ముందుకు పడుతున్నాయి. మాటలు తడపడుతున్నాయి. అంత చలి లో కూడా చెమటలు పట్టేస్తున్నాయి. ఒకరి వెనుక ఒకరు. వీళ్ళకి దారి చూపిస్తూ చాలా ముందు గా గూడెం మనిషి లింగన్న. పైన ఏదో నిధి వుంది. వంద సంవత్సరాలు గా ఎవరూ ఎక్కలేదు అనేది అబద్ధం. నిధి కోసం చాలా మంది వచ్చారు. పోలీసులకి తెలికుండా వాళ్ళందరికీ దారి నేనే చూపించాను. కాని ఎవ్వరూ తిరిగి రాలేదు. చచ్చి దెయ్యాలు అయ్యారు అని ఈ గూడెం జనం అంటున్నారు. రిషి, శ్వేత, జాన్, షీనాల అడుగులు ఆగి పోయాయి. వాళ్ళ కోసం రాము ఆగిపోయాడు. వీళ్ళందరి కోసం లింగన్న. ముఖాల్లో భయం చూసి పంచె లోంచి తాయత్తులు తీసాడు. ఇవి ఈ కొండ పై చావులు ఓ స్వాములోరికి వివరంగా చెప్పి చేయించిన మహిమ గల తాయత్తులు. ఒక్కోటి అయిదు వందలు. భూత ప్రేత పిశాచాలు ఏ ఒక్కటి మీ దగ్గరకి రావు. నమ్మకం వుంటే తీసుకోండి. బలవంతం లేదు. మరు నిమిషం లింగన్న చేతుల్లో డబ్బులు అయిదుగురి చేతులకి తాయత్తులు. భయంతో తాయత్తు కట్టించుకోలేదు. ఆ లింగన్నకి నాలుగు డబ్బులు వస్తాయి అని కట్టించుకున్నాను. రాము తనలో తాను అనుకున్నాడు. కొద్ది దూరం నడిచాక లింగన్న ఆగి పోయాడు. ఇక నేను ఎనక్కి పోతాను. ముందుకు పోవాల్సింది మీరు. ఆ దేవుని దయ వుంటే మళ్ళీ కలుద్దాం. జాగ్రత్త చెప్పి లింగన్న వెనక్కి పోడానికి సిద్ధం. మీరు కూడా వెళ్లిపోండి.

నేను ఒక్కడినే వెళ్ళి వస్తాను భయపడుతూ వున్న నలుగురి తో రాము అన్నాడు. మేము ప్రేమించుకున్నాం. మా పెద్దవాళ్ళు బ్రతకలేం అన్నారు. అందుకే ఈ భయంకరమైన కొండ ఎక్కి మా ప్రేమలో ఎంత సాహసం వుందో చూపించి మరీ పెళ్లి చేసుకుంటాం. అస్సలు ఈ కొండ ఎక్కే ప్లాన్ వేసిందే మేము. మమ్మల్ని వెళ్లిపో అంటున్నావు అని రిషి, శ్వేత, జాన్, షీనా జంటలు నవ్వుతున్నారు. ఈ నవ్వులు మీరు తిరిగి వచ్చేదాకా అలానే వుండాలి. లింగన్న కనిపించనంత దూరం వెళ్ళిపోయినా వెళ్తూ వెళ్తూ అన్న ఈ మాట అందరి చెవుల్లో ఇంకా మ్రోగుతూనే వుంది. సూర్యుడు వీళ్ళ సాహసాన్ని చూడాలని తొందర పడుతున్నాడు. మేము కూడా చూడాలి అని మేఘాలు పోటీ పడుతూ అడ్డుగా వస్తున్నాయి. పాటలు పాడుతూ హుషారు గా ముందుకు నడుస్తున్నారు. గంట గడిచింది. ఒక కోన దగ్గర నిలబడి ప్రకృతి ని చూసారు. ఆనందం ఎక్కడ వుంటుంది అనేది చాలా మంది ప్రశ్న. ఒక్కొక్కరిదీ ఒక్కొక్క అభిప్రాయం. కానీ వీళ్ళు నిలబడిన చోటు నుంచి చూసిన దృశ్యం. అందరిదీ ఒకే మాట. ఆనందం అంటే ఇదే. అందరి కళ్ళలో ఆనంద బాష్పాలు. వీళ్ళ ఆనందం చూసి మేఘాలు కరిగి పోయాయి. కన్నీళ్ళ తో చినుకులు కలిసిపోయాయి. చల్లని పిల్లగాలి మైమరిపిస్తోంది. అప్పటికే ఆనందం అంచుల్లో వున్నారు. ఇక కొండల్ని కలుపుతూ ఆకాశం లో ఏర్పడిన హరివిల్లు. ఆనందం అంచుల నుంచి హుషారు గా కేరింతలు. దూరం నుంచి కోయిల పాట. మరికొంత దూరం లో నెమ్మళ్ళ నాట్యం. జలపాతాల హోరు. వర్షం జోరు. అందరూ పక్కనే వున్న గృహలలో దాక్కున్నారు. వర్షం తగ్గింది. ప్రతాపుడు బయటకి వచ్చి తన ప్రతాపం చూపిస్తున్నాడు. తన పక్కనే వున్న అస్తి పంజరం చూసి షీనా కెవ్వున కేక పెట్టింది. బయటకి పరిగెట్టింది. మిగతా వాళ్ళు బయటకి వచ్చారు. రాము మాత్రం అక్కడ వున్న రాళ్లని ఒక్కొక్కటి పక్కకి తోస్తూ వున్నాడు.

రిషి, జాన్ సాయం చెయ్యడానికి మళ్ళీ వచ్చారు. లోపల ఒక్కటి కాదు వందల కొద్ది పుర్రెలు, ఎముకలు. వాసన భరించలేక బయటకి వచ్చేసారు. ఆనందం అంచులు చూసిన వీళ్ళు మళ్ళీ భయం మొదల్లులో నిలబడ్డారు. భయపడుతూ నిలుచున్నారు.

ఇప్పటికైనా వెనక్కి వెళ్లిపోతారా రాము వాళ్ళ భయాన్ని గుర్తుచేస్తూ అన్నాడు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ నవ్వారు. ఇక్కడ ఈ చివర నిలబడి చూస్తేనే ప్రకృతి ఇంత అందం గా వుంది. అదిగో ఆ కొండ పైన కూర్చొని చూస్తే వచ్చే ఆ ఆనందం మాకు కావాలి అందరూ కలిసి ఒకే సారి అన్నారు. అలా చాలా సేపు నడుస్తూనే వున్నారు. మధ్య మధ్య లో తమతో తెచ్చుకున్నవి తింటున్నారు, తాగుతున్నారు. నీడ లో కూర్చొని ఒకరి గురించి ఒకరు తెలుసుకుంటున్నారు. మేమంటే ప్రేమ కోసం వస్తున్నాం. మీరు కథ కోసం ఈ సాహసం చేస్తున్నారు అంటే నవ్వొస్తోంది అన్నారు. నాకు కథ అంటే ప్రేమ. ఆ ప్రేమ కోసం నేను ఈ సాహసం. సో అందరం ప్రేమ కోసమే చేస్తున్నాం అని రాము చెప్పిన సమాధానం తో తెరిచిన నాలుగు నోళ్ళు ఒకేసారి మూత పడ్డాయి. మళ్ళీ నడవడం మొదలు పెట్టారు. కెమెరాతో ఫోటో లు, సెల్ఫీలు. చీకటి పడుతోంది. అనువైన ఒక ప్రదేశం చూసుకొని టెంట్ లు వేస్తున్నారు. మొత్తం మూడు టెంట్ లే వేసారు. ఒకటి రాము కోసం. మరో రెండు రిషి, శ్వేత మరియు జోహ్, షీనా ల కోసం. పెళ్ళికి కి ముందు ఒకే టెంట్ లో వుండడానికి అమ్మాయిలు నో అన్నారు.

రిషి, జాన్ కలిసి వుండండి. శ్వేత, షీనా కలిసి వుంటాం అన్నారు. అమ్మాయిలు కలిసి వుంటే ఏమనుకోరు, ఇద్దరు అబ్బాయిలు కలిసి వుంటే ఈ సమాజం కోడై కూస్తుందే అన్నాడు రిషి. మనం సమాజం కి దూరం గా అడవి లో వున్నాం. ఎవరూ ఏమి అనుకోరు లే అని అమ్మాయిల తెలివైన సమాధానం. మీ సాహసం ఈ కొండ ఎక్కే దాంట్లో చూపించండి. ఒకే టెంట్ లో మాతో సాహసం చెయ్యడానికి ఇంకా కాస్త వైట్ చెయ్యాలి. ఆ మాట చెప్పి ఇద్దరూ అమ్మాయిలు నవ్వుతున్నారు. వాళ్ళని చూస్తూ రాము కి కూడా నవ్వొచ్చింది. ఆ నవ్వులోంచి సౌమ్య గుర్తొచ్చింది. పెళ్లి తర్వాత తమ మొదటి రాత్రి అయ్యాక తను పక్కన లేకుండా ఒంటరి గా వున్న మొదటి రాత్రి ఇది అనుకున్నాడు. ఎవరో ఒకరు కాపలా వుండాలి. అందరూ పడుకుంటే కష్టం. శ్వేత, షీనా మీరు నా టెంట్ లో పొడుకోండి. రిషి, జాన్ మిగతా రెండు టెంట్ లో విడి విడి గా మీ ఇద్దరూ రాము నవ్వుతూ అన్నాడు. నేను మొదట కావలా కాస్తాను. తర్వాత రిషి, జాన్ కంటిన్యూ చేస్తారు. అందరూ టెంట్ లో దూరారు.

పౌర్ణమి కావడం తో వెలుతురు బాగానే వుంది. తన తో తెచ్చుకున్న రేడియం బుక్ లో తమ అడుగుల్ని మాటల గా మారుస్తున్నాడు. ఏదైనా మరచిపోతే గుర్తుకు వస్తుంది అని కెమెరా తీసుకొని ఫోటో లు చూస్తున్నాడు. ఒక ఫోటో దగ్గర ఆగిపోయాడు. బాగా జూమ్ చేసి చూసాడు. దూరం గా చెట్టు మీద ఏదో ఆకారం. మనిషి లాగే కనిపిస్తోంది. వెనక్కి వెళ్ళి ప్రతీ ఫోటో లో చూసాడు. అదే ఆకారం ప్రతీ ఫోటో లో వుంది. అలారం మ్రోగింది. రిషి లేచి కూర్చున్నాడు. రాము పడుకోడానికి వెళ్ళాడు. రిషి భయపడుతూ కాపలా కాస్తున్నాడు. కొంత సేపటికి జాన్ లేచాడు. జాన్ కూడా భయపడుతూనే కాపలా కాస్తున్నాడు. మరికాసేపటికి సూర్యుడు లేచాడు. దాంతో అందరూ లేచారు. కాలకృత్యాలు తీర్చుకున్నారు. తమతో తెచ్చుకున్న ఫుడ్ తో పాటు ఈ అడవి లో దొరికిన ఫలాలు తింటున్నారు. మధ్య మధ్య లో మాట్లాడుతూ పోట్లాడుతూ వున్నారు. చాలా సరదాగా వున్నారు. రాము బాగ్ లోంచి కెమెరా తీసి ఒక ఫోటో జూమ్ చేసి చూపించాడు. అందరూ దూరం గా కనిపిస్తున్న ఒక ఆకారాన్ని కళ్ళు దగ్గరకి పెట్టి మరీ చూశారు. లైటింగ్ సరిగా లేక ఏదైనా ప్రాబ్లం వల్ల కెమెరా లో వచ్చిన మార్క్ లా వుంది అన్నారు. వెనక్కి వెళ్ళి అన్నీ ఫోటో లు జూమ్ చేసి చూడండి. ఒక్కో ఫోటో లో ఒక్కో దగ్గర వుంది ఆ ఆకారం. అంటే అది కెమెరా లో ప్రాబ్లం కాదు. మనల్ని ఎవరో గమనిస్తున్నారు రాము అన్నాడు.

నలుగురి లో భయం మొదలయ్యింది. ఒక వేల అది దెయ్యామో బూతమో కాదు కదా అమ్మాయిలు ఇద్దరూ కలిసి ఒకే సారి అన్నారు. ఏమో దెయ్యం అయ్యే వుండొచ్చు. తాయత్తులు జాగ్రత్తగా వుంచుకోండి అన్నాడు రాము. షీనా గట్టిగా కేక వేసింది. తన చేతి కి కట్టిన తాయత్తు పోయింది. భయం తో షీనా ఏడుస్తోంది. రాము తన చేతికి వున్న తాయత్తు తీసి షీనా కి కట్టాడు. నాకేం కాదు లే పర్లేదు అన్నాడు తన వైపు చూస్తున్న జాన్ తో. అందరూ మళ్ళీ కొండ ఎక్కుతున్నారు. ఇంక రెండు ఘంటల్లో చీకటి అవుతుంది.      కొండకి దగ్గర లోనే వున్నారు. కాస్త కష్టపడితే సూర్యుడి అస్తమయాన్ని కొండ పై నిలబడి చూడొచ్చు. అందరి లో జోష్ ని పెంచాడు రాము. షీనా అలసి పోయింది. తెచ్చుకున్న వాటర్ అయిపోయింది. కొంచెం దూరం లో చెట్ల మధ్య లోంచి నీరు పారుతున్న శబ్దం వినిపిస్తోంది. నేను వెళ్ళి నీళ్ళు తీసుకొస్తాను మీరు ఇక్కడే వుండండి అని బాటిల్ తీసుకొని రామ్ అటువైపు వెళ్ళాడు.      అయిదు నిమిషాలయ్యింది. పది నిమిషాలయ్యింది. అరఘంటయ్యింది. రాము తిరిగి రాలేదు. నిమిషం నిమిషం కి భయం పెరుగుతూ వచ్చి వణికి పోతున్నారు రిషి, శ్వేత , జాన్ , షీనా లు. ఆ దెయ్యమే రాము ని ఏదో చేసింది. ఇదంతా నా వల్లే. నా తాయత్తు పోగొట్టుకున్నాను. తన తాయత్తు నాకు ఇచ్చి నా ప్రమాదం తాను తీసుకున్నాడు. షీనా ఏడుస్తూ అంది. మీ ఇద్దరూ ఇక్కడ నుంచి కదలొద్దు అని చెప్పి రిషి, జాన్ నీటి శబ్దం వెతుకుతూ అటువైపు వెళ్లారు.

రాము అంటూ పెద్దగా అరుస్తున్నారు. కాసేపు వెతికి వెనక్కి తిరిగి వచ్చారు. శ్వేత, షీనా అక్కడ లేరు. చుట్టూ చూసారు. వెనక్కి తిరిగే లోపల తల మీద గట్టిగా ఎవరో కొట్టారు. కళ్ళు మూతలు పడుతూ చూసిన ఆకారం ఫోటో లో చూసిన అకారమే.      చీకటి పడింది. నీళ్ళ కోసం వచ్చిన రాము కి ఒక చిరుత ఎదురయ్యింది. దాన్ని తప్పించుకొని పరిగెత్తి జలాశయం లో దూకేసాడు. నీళ్ళ వేగం కి అదుపు తప్పి ఒక బండ కి తల తగిలి స్పృహ కోల్పోయాడు. ఒడ్డుకి వచ్చి అలానే చాలా సేపు వున్న తనకు ఇదంతా గుర్తుకొచ్చి మెల్లగా కళ్ళు తెరిచాడు. అలాగే పాక్కుంటూ వెళ్ళి ఒక రాయికి అనుకోని కూర్చున్నాడు. తల కి దెబ్బ. మోకాలి నుంచి రక్తం కారుతోంది. అప్పుడు తన వాళ్ళు గుర్తొచ్చారు. తనకు తానే ధైర్యం చెప్పుకున్నాడు.      మెల్లగా లేచి      నడవడం మొదలు పెట్టాడు. అక్కడకి వెళ్ళి చూస్తే ఆ నలుగురూ లేరు. బాగ్ లు చెల్లా చెదురు గా క్రింద పడిపోయి వున్నాయి. నేల మీద రక్తం మరకలు వున్నాయి. రాము మొదటి సారి భయపడ్డాడు. షీనా కి తాను ఇచ్చిన తాయత్తు లో తాను ఒక పరికరం పెట్టాడు. లాప్ టాప్ ఓపెన్ చేసి ఆ తాయత్తు కో కనెక్ట్ చేసి చూసాడు. ఒక మైలు దూరం లోనే వున్నారు. అది చూపిస్తున్న డైరక్షన్ లో ముందుకు కదిలాడు. తాయత్తు సిగ్నల్ వస్తున్న ప్లేస్ లోనే వున్నాడు.

కానీ అక్కడ ఏమి కనిపించడం లేదు. ఏమి తోచడం లేదు. కాళ్ళ క్రింద ఆకులు. కానీ ఆ ఆకులు చుట్టూ వున్న ఏ చెట్టు కి సంబందించినవి కాదు. అనుమానం తో ఆకులు పక్కకి తోసి చూసాడు. ఏదో డోర్ వుంది. ఓపెన్ చెయ్యబోయి ఆగాడు. తన బాగ్ లోంచి ఒక సెన్సర్ తీసి దానిపై వుంచాడు. డోర్ ఓపెన్ చేస్తే ఎవరికో సిగ్నల్ వెళ్తుంది. తన దగ్గర వున్న మాగ్నెటిక్ ఎక్విప్మెంట్ తో ఆ కనెక్షన్ బ్రేక్ చేసాడు. మెల్లగా లోపలికి వెళ్ళాడు. ఒక పక్కగా నిలబడి అక్కడ ఏమి జరుగుతుందో అని తొంగి చూశాడు. అక్కడ జరుగుతోంది మారణహోమం. జంతువుల్లా మనుషుల అవయవాలు వ్రేలాడదీసి వున్నాయి. ఒక నలుగురు డాక్టర్ లు మరి కొన్ని డెడ్ బాడీ ల మీద పని చేస్తూ వున్నారు. మరో ఇద్దరు ఒక్కొక్క అవయవాన్ని ఒక్కోరకం గా భద్ర పరుస్తున్నారు. వాళ్ళు చేస్తున్న పనిని పర్యవేక్షిస్తూ కొందరు మనుషులు. చాలా భలం గా భయంకరం గా కూడా వున్నారు. అక్కడే గోడ కి వున్న బెల్ మ్రోగింది. ఆ రోజు కి పని ముగింపుకు అది సంకేతం. డాక్టర్ లని పట్టుకెళ్లి ఒక కేజ్ లో వేసారు.      ముఖానికి వున్న ముసుగు తీసారు ఆ డాక్టర్ లు. నలుగురు మగ వాళ్ళు. ఇద్దరు ఆడవాళ్ళు. ముసుగు తీసి ఒక లేడి డాక్టర్ ఏడ్వడం మొదలు పెట్టింది. మిగతా వాళ్ళు

ఓదారుస్తున్నారు. నన్ను ఇక్కడకి తీసుకొచ్చి సంవత్సరం అయ్యింది. ఈ నరకం నుంచి ఎప్పటికీ భయటకి వెళ్లలేం. భలవంతం గా మనలో ఎవరైనా చచ్చిపోతే మిగతా వాళ్ళకి నరకం చూపిస్తారు.

వాళ్ళు భలవంతం గా మనుషుల్ని ఎత్తుకొచ్చి చంపేస్తున్నారు. వాళ్ళ అవయవాలు వేరు చేసి వాళ్ళ వ్యాపారానికి సాయం చేస్తూ ఈ పాపానికి మూల కారణం మనమే అంది ఏడుస్తూ వున్నా డాక్టర్. మనం ఈ పాపం చెయ్యక పోతే వాళ్ళు మన వాళ్ళని ఎత్తుకొచ్చేస్తారు. వాళ్ళు ఇచ్చిన వార్నింగ్ గుర్తుంది కదా అంది మరో డాక్టర్. అందరూ బాధ పడుతూ అలా గోడ కి అనుకొని కూర్చున్నారు. ఆ అమ్మాయి ని దూరం నుంచి చూసి రాము కి ఆనందం వేసింది. తను వీణా. తన గారాల చెల్లెలు. కష్టపడి డాక్టర్ చదివించాం. డాక్టర్ డిగ్రీ తో పాటు ఒక అబ్బాయి ని వెంటపట్టుకొని ఇంటికొచ్చింది. నాన్న కి అది నచ్చ లేదు. వీణా ని భలవంతం గా గది లో పెట్టేసాడు. అబ్బాయిని భయటకి గెంటేసి ముఖం మీదే తలుపులేసాడు. పొద్దున సూర్యోదయం లో సూర్యుడు కనిపించాడు. కానీ గది తలుపులు తెరిస్తే వీణా కనిపించ లేదు. ప్రేమ కోసం వెళ్లిపోతున్నాను. మీకు ప్రేమ ని ఆశీర్వదించే మనస్సు కలిగినప్పుడు మీ ముందుకు వస్తాను. లెటర్ వ్రాసి పెట్టి ప్రేమించిన వాడి కోసం మమ్మల్ని వదిలి వెళ్లింది. రాము చాలా వెతికాడు. వీణా ఆచూకీ దొరకనే లేదు. చాలా రోజుల తర్వాత వీణా ప్రేమించిన అబ్బాయి డెడ్ బాడీ ఈ కొండ చివరే దొరికింది. ఆ డెడ్ బాడీ ని పరీక్షించిన డాక్టర్ ని కలిసాడు. ఆ డెడ్ బాడీ లో ముఖ్యమైన అవయవాలు లేవు. అవి చాలా నైపుణ్యం గా వేరు చెయ్యబడ్డాయి అని ఆ డాక్టర్ చెప్పాడు. డాక్టర్ చెప్పిన విషయం రాము కి ఆశ్చర్యం తో పాటు అనుమానం కలిగించింది.

అలా అప్పటి నుంచి ఈ కొండ మీద తన రిసర్చ్ మొదలు పెట్టాడు. తన అనుమానం నిజం అయ్యింది. తన చెల్లెలు వీణా ఇక్కడే బంధీ గా వుంది. గతం లోకి వెళ్ళిన ఆలోచనల నుంచి మళ్ళీ ప్రస్తుతం కి వచ్చాడు. పోలీసు లకి చెప్పినా నమ్మలేదు. అందుకే తానే కష్టపడి ఇక్కడ దాకా చేరుకున్నాడు. చెల్లి ని కాపాడుకోడం తో పాటు ఈ గుట్టు ని రట్టు చేస్తే తన సాహసం కి విజయం చేకూరినట్టే. ఇంత లో డాక్టర్ కేజ్ కి భోజనం పట్టుకొని వచ్చారు. త్వరగా తినేసి పడుకోండి. కొత్త మనుషులు వచ్చారు. వాళ్ళకి పొద్దునే ఆపరేషన్ చెయ్యాలి. కొత్త మనుషులు అనగానే రాము మైండ్ లో ఋషి, శ్వేత, జాన్, షీనా వచ్చారు. వాళ్ళ కోసం వెతికాడు. ఏ మాత్రం చప్పుడైనా , తొందరపడినా తను కూడా ఆ కొత్త డెడ్ బాడీ జాబితా లో చేరిపోతాడు. వాళ్ళు ఒక గది లో కనిపించారు. స్ట్రెచర్ మీద పడుకోబెట్టి వున్నారు. నాడి పట్టుకొని చూసాడు. బ్రతికే వున్నారు కానీ స్పృహ లో లేరు. మొత్తం ఈ గాంగ్ ఇరవై మంది వున్నారు. ఏదైనా అవకాశం కల్పించు అని రాము దేవుణ్ణి ప్రార్థించాడు. అప్పుడే దూరం గా బిర్యానీ పాకెట్ లు కనిపించాయి. వాటిని ఇద్దరు అక్కడ సర్దుతూ వున్నారు. మనం ఈ రోజు కొత్త మనుషుల్ని పట్టుకున్నాం. బాస్ మన కోసం బిర్యానీ పంపించాడు. బీర్ లు పంపించాడు. మనం ఈ రోజు పట్టిన అమ్మాయిలు సూపర్ గా వున్నారు. బాస్ కి ఇద్దరే దొరికారు అని చెప్పాం. అబ్బాయిల బాడీ లు బాస్ కి. ఆ అమ్మాయిల బాడీ లు మనకి. ఆ ఇద్దరి మాటల్ని రాము బాగా గమనించాడు. మిగతా వాళ్ళని తీసుకొని వద్దాం అని అక్కడ నుంచి వెళ్లారు .

రాము దగ్గర రెండు నిమిషాలే టైమ్ వుంది. తన బాగ్ లోంచి ఒక బాటిల్ తీసి అది అక్కడ పాకెట్ లలో కలిపేసాడు. పక్కకి వెళ్ళి దాక్కున్నాడు. వాళ్ళందరూ వచ్చి తిన్నారు, తాగారు. కాసేపటికి మొత్తం అక్కడే కుప్పకూలి పోయారు. ఆ మందు ఎంత సేపు పని చేస్తుందో తెలిదు. వెంటనే తన చెల్లెలు వుండే కేజ్ దగ్గరకి పరిగెట్టాడు. రాము ని చూసి షాక్ లోంచి బయటకి రాడానికి డాక్టర్

లకి చాలా టైమ్ పట్టింది. తన మాటల తో వాళ్ళని అలెర్ట్ చేసాడు. ఆ డాక్టర్ లు ఆ గాంగ్ కి మరో డోస్ మత్తు ఇంజెక్షన్ ఇచ్చేశారు. గాంగ్ లో అందరిని తాడు తో ఒకరిని ఒకరు లింక్ చేస్తూ కట్టేసారు. ముఖానికి ముసుగులు వేసారు. రాము తో పాటు వచ్చిన ఆ నలుగురికీ డాక్టర్ లు విరుగుడు ఇంజెక్షన్ ఇచ్చారు.      వాళ్ళు అర ఘంటకి స్పృహలోకి వచ్చారు. జరిగింది తెలుసుకొని, అక్కడ జరుగుతుంది చూసి భయపడి పోయారు. సూర్యోదయం అయ్యింది. రాము ఆ కొండ చివర కూర్చొని ప్రకృతి ని చూస్తున్నాడు. వెనుకనే ఋషి, శ్వేత, జాన్, షీనా. వాళ్ళ వెనుక డాక్టర్ లు. అందరి ముఖాల్లో భయంకరమైన భయాన్ని చూసిన తర్వాత వచ్చిన సంతోషం. రాము లాప్ టాప్ కి మెసేజ్ వచ్చింది. POLICE AND MEDIA ARE ON THE WAY!

కొన్ని రోజులకు రాము ఇదంతా కథ గా వ్రాసి పంపించాడు. తన కథ చూసి ఆ పత్రిక ఎడిటర్ నుంచి ప్రశంస పత్రం. కరుడుగట్టిన గాంగ్ ని పట్టించినందుకు గవర్నమెంట్, పోలీసు ల నుంచి అవార్డ్ లు రివార్డ్ లు . చెల్లెల కోసం ఇంత త్యాగం చేసిన కొడుకు ని గుండెలకు హత్తుకొని అమ్మ, నాన్న. అన్నయ చూపించిన ప్రేమ కి పాదాల మీద పడి ఏడుస్తూ చెల్లెలు. భర్త సాహసం చూసి లో లోపలే మురిసిపోతూ సౌమ్య.      వీళ్ళందరిని చూస్తూ హాపీ గా రాము. టేబుల్ మీద మరో పత్రిక.      గాలికి పేజి లు కదిలి ఒక పేజి దగ్గర గాలి, రాము చూపు ఆగిపోయాయి. దెయ్యాల కథ ల పోటీ అని వుంది ఆ పేజ్ లో. రాము కి ఆ వీధి చివరనే వున్న దెయ్యాల కోట గుర్తుకొచ్చింది.




ముసునూర్ లో కొత్తగా పెట్టిన కాన్వెంట్ లో ప్లేక్లాస్ లో చేరాడు మూడేళ్ళ మున్నీ. ఆరోజు వాళ్ళమ్మ లంచ్ కోసం ఇచ్చిన పెరుగన్నం తినబోతుండగా ఒక తెల్లని కుక్క పిల్ల వచ్చి తోకాడిస్తూ మున్నీ ముందు నిల్చుంది. వాళ్ళమ్మ చెప్పిన మాట

గుర్తొచ్చింది మున్నీకి. తినేప్పుడు ఎవరైనా వస్తే వాళ్ళకు కాస్త పెట్టి తినమని. వెంటనే మున్నీ ఒక స్పూన్ పెరుగన్నం ఒక ఆకులో పెట్టి దాని ముందుంచాడు. అది మున్నీ వైపు ప్రేమగా చూసి ,ఆ పెరుగన్నం తినింది. మున్నీ కూడా గబగబా తినేసి చేయి కడుక్కున్నాడు. ఆ కుక్క పిల్లవాడి దగ్గర నిల్చుని తోక ఊపి వెళ్ళింది. అలా రోజూ వాడి లంచ్ టైం కు ఆ తెల్లకుక్క వచ్చేది.

మున్నీ దాన్ని 'రాజూ!' అని పిలుస్తూ రోజూ దానికి కొద్దిగా పెరుగన్నం పెట్టి తాను తినే వాడు. అలా ఆ రాజు మున్నీకి మంచి స్నేహితుడైంది. ఆ ఊర్లో ఉండే భైరవాలయంలో ప్రతి ఏడాదీ జరిగే తిరునాళ్ళు వచ్చింది. చాలా అంగళ్ళు రోడ్డుకు రెండు వైపులా తాత్కాలికంగా వెలిశాయి. మున్నీ వాళ్ళమ్మ దీపావళి సరంజామా కొత్త బట్టలు మున్నీకి ఆట వస్తువులు కొందామని మున్నీ ని తీసుకుని తిరునాళ్ళు కు వెళ్ళింది. వాడికి కావల్సినవి కొని తాను గాజులు కొక్కుంటుండగా, అక్కడికి రాజు వచ్చింది. మున్నీ తన చేతిలోని బిస్కెట్ ఒకటి దానికి ఇచ్చి, అక్కడున్న రంగుల రాట్నం చూస్తూ అక్కడికి వెళ్ళి , అక్కడున్న బొమ్మ గుఱ్ఱాలనూ, లోలు బొమ్మలనూ చూస్తూ అమ్మ నుంచి తప్పి పోయాడు. వాడికి భయమేసింది. అంత మంది జన్నాన్ని వాడేప్పుడూ చూడలేదు. వారిలో తన అమ్మ ఎక్కడుందో ఆ చిన్నారి కనుక్కోలేక పోయాడు.

ఏడుస్తూ అటూ ఇటూ తిరగ సాగాడు. మున్నీ అమ్మ గాజులు చేతికి వేయించుకుని తిరిగి చూస్తే మున్నీ కనిపించలేదు. వాళ్ళమ్మ కూడా భయంతో ' మున్నీ మున్నీ ' అని పిలుస్తూ అటూ ఇటూ తిరగ సాగింది. ఇంతలో ఆమె పమిట ఎవరో పట్టుకుని లాగుతున్నట్లు అనిపించి, చూడగా ఒక తెల్ల కుక్క పిల్ల ఆమె పమిట కొంగు పట్టుకు లాక్కు పోసాగింది. ఆమె ఆ కుక్క పిల్ల వెంట వెళ్ళగా అక్కడ ఒక చెట్టు క్రింద నిల్చుని ఏడుస్తున్న మున్నీ కనిపించాడు. అమ్మ వాడిని చూడగానే పరుగులో వెళ్ళి వాడ్ని ఎత్తుకుంది.

మున్నీ అమ్మ పక్కనే ఉన్న రాజును చూసి ,"అమ్మా! ఈ రాజూకే నేను రోజూ లంచ్ సమయంలో పెరుగన్నం పెట్టేది." అన్నాడు. అమ్మ ఆ రాజూను ఎత్తుకుని ముద్దు పెట్టుకుని, "చూశావా! మున్నీ! నోరు లేని ఒక ప్రాణికి ఇంత కొంచెం అన్నం పెడితే ఈ రోజు మనకెంత సాయం చేసిందో చూశావా! ఎల్లప్పుడు అవసరమైన వాళ్ళకు మనమూ సాయం చేస్తూనే ఉండాలి నాన్నా!" అంది.

నీతి - హెల్ప్ ఎవర్. హర్ట్ నెవర్.




సుగంధి పురం పరిసర ప్రాంతాల్లో దినుసుల వర్తకం చేసేవాడు వర్ధనయ్య. కొన్నాళ్ళుగా అక్కడ కరువు కాటకాలు తాండవించడంతో వ్యాపారం కోసం దూరప్రాంతం బయల్దేరాడు. నెల రోజుల ప్రయాణం తరువాత పచ్చని పొలాల మధ్య ఒక ఊరును చూసిన వర్ధనయ్య కొన్నాళ్ళు ఆ వూళ్ళో వ్యాపారం చేయాలనుకున్నాడు.

ఊరుకి వెళ్ళే దారిలో పశువుల మంద వెనుకనే నడిచి వస్తున్న కాపరిని చూసాడు వర్ధనయ్య. ఊళ్ళో ఎంత మంది వ్యాపారులున్నారని అడిగాడు కాపరిని. ఊరికి చెందిన వాళ్ళు లేరని, పొరుగూరు నుంచి పంట కాలంలో వచ్చి కొనుగోళ్ళు జరుపుతారని చెప్పాడు కాపరి. అతడి మాటలు విన్న తరువాత అక్కడే తన వ్యాపారం సాగించాలని నిర్ణయించాడు వర్ధనయ్య.

తనకి కొన్నాళ్ళ పాటు ఆశ్రయం ఇవ్వగల వ్యక్తుల కోసం కాపరిని అడిగాడు వర్ధనయ్య. కనకయ్య, కాంతయ్యలని కలిస్తే తప్పక పని జరుగుతుందన్నాడు కాపరి. అతడి పశువులు దారి ప్రక్కన వున్న పంట పొలాల్లోకి దిగి మేతకు సిద్ధమవడంతో వాటిని ఆపడానికి పరిగెత్తాడు కాపరి.

తరువాత వర్ధనయ్యకు ఒక పండితుడు ఎదురయ్యాడు. ఆయనకు నమస్కరించి కనకయ్య కాంతయ్యలు మీకు అనడిగాడు వర్ధనయ్య.

ప్రతి నమస్కారం చేసిన పండితుడు "బేషుగ్గా తెలుసును. వ్యక్తిత్వంలో కనకయ్య కొబ్బరికాయ. కాంతయ్య రేగుపండు " అని సమాధానం చెప్పి , పద్యమేదో పాడుకుంటూ వెళ్ళిపోయాడు.

మరో ప్రశ్న అడిగే అవకాశం రాలేదు వర్ధనయ్యకు. పండితుడు చెప్పిన కాంతయ్య, కనకయ్యల వ్యక్తిత్వాలను మనసులోనే విశ్లేషించుకున్నాడు వర్ధనయ్య. కాంతయ్యను రేగుపండుతో సరిపోల్చాడు కనుక రేగు పండు రూపం లో ఎర్రగా రుచిలో తియ్యగా వున్నట్టు అతడూ మంచి మనసుతో , సహాయ బుద్ధితో వుండొచ్చుననుకున్నాడు. కాంతయ్య ఇంటికే వెళ్ళాడు వర్ధనయ్య.

కాంతయ్యను కలుసుకుని తన గురించి పరిచయం చేసుకుని కొన్నాళ్ళు వసతి సౌకర్యాలు కోరాడు వర్ధనయ్య. సంతోషంగా అంగీకరించాడు కాంతయ్య. మర్యాదలు జరిపించాడు. తమ పని వాళ్ళ ద్వారా పొరుగునున్న గృహంలో వసతి ఏర్పాటు చేసాడు. చక్కటి భోజనం పెట్టించాడు. తమ ఊరిలో పండించే దినుసులు మొదలు వాటి ధర వరలు, రవాణా సౌకర్యాల సమాచారం చెప్పి, తనని కూడా వ్యాపార భాగస్వామిగా చేర్చుకోమన్నాడు కాంతయ్య. గ్రామస్తుడు తన భాగస్వామి అయితే తనకి ప్రయోజనమేనని సరే అన్నాడు వర్ధనయ్య.

కాంతయ్య వ్యక్తిత్వం రేగు పండుతో సరిపోదనుకున్నాడు వర్ధనయ్య.

రెండు రోజులు గడిచాక కాంతయ్య నిజ స్వరూపం నెమ్మది నెమ్మదిగా బోధపడింది వర్ధనయ్యకి. ఉడికీ ఉడకని అన్నం , ఉప్పు లేని కూర , పులుపు లేని కలవని చారు, నాసి రకం పెరుగులు మాత్రమే భోజనంగా పెడుతూ రుసుములు భారీగా కోరేవాడు కాంతయ్య.

వ్యాపార భాగస్వామ్యం కోరినా సరే పెట్టుబడి వాటా ధనం ఇవ్వలేదు కాంతయ్య. మూడు మాసాల తరువాత వర్ధనయ్యకు లాభం వచ్చిందని తెలిసి తన వాటా పంచమన్నాడు కాంతయ్య. అదెలా కుదురుతుందని అడిగిన వర్ధనయ్య మాటలు వినకుండా గ్రామ పెద్దల ముందు వివాదం తెచ్చాడు. భాగస్వామిగా చేర్చుకుంటానన్న వర్ధనయ్య మాట ప్రకారమే లాభాన్ని పంచమన్నారు పెద్దలు.

గ్రామస్తులతో తనకు జరిగిన అన్యాయం వర్ధనయ్య చెప్పినప్పుడు కాంతయ్య లాంటి ఆశ బోతు, పిసినారి , స్వార్ధపరుడు

మరొకరు లేరు అన్నారు వాళ్ళు. అప్పుడు మాత్రం వర్ధనయ్యకు పండితుడి మాటలు గుర్తొచ్చాయి. అతడి గురించి వాకబు చేసిన వర్ధనయ్యకు పండితుడు దేశ సంచారంలో గడుపుతూ ఏడాదిలో ఎప్పుడైనా ఒక్కసారి వస్తుంటాడని చెప్పారు గ్రామస్థులు.

కాంతయ్య ఇంటిలో ఇమడలేక బయటపడిన వర్ధనయ్య నేరుగా కనకయ్యను కలిసాడు. జరిగింది చెప్పి కొన్నాళ్ళ పాటు తనకు ఆశ్రయం ఇవ్వమన్నాడు.

ముందుగా కలవనందుకు కోపంతో బుసలుకొట్టాడు కనకయ్య. ససేమిరా కుదరదన్నాడు. తెలియక తప్పుచేసానని, పెద్ద మనసుతో సాయం చెయ్యమన్నాడు వర్ధనయ్య. కాసేపటికి శాంతించిన కనకయ్య సాధారణ స్థితిలో మాట్లాడాడు. తన ఇంట్లో వర్ధనయ్య వుండాలంటే ఏయే నిబంధనలు పాటించాలో చెప్పాడు. వర్ధనయ్య అంగీకరించాడు.

కాంతయ్య అడిగినట్టే వ్యాపార భాగస్వామ్యం కోరిన కనకయ్య సరిపడినంత ధనం అందజేసాడు. న్యాయంగా వచ్చేదే లాభం పంచమన్నాడు. వర్ధనయ్య వున్నన్ని రోజులూ సౌకర్యాలతో తేడా రానీయలేదు కనకయ్య. వ్యాపారం సజావుగా జరిగి లాభాలు వచ్చినప్పుడు , న్యాయమైన వాటాను కనకయ్యకు అందించాడు వర్ధనయ్య.

సుగంధిపురం లో పరిస్థితులు చక్కబడ్డట్టు వర్తమానం వచ్చింది వర్ధనయ్యకు. ఇక్కడి లావాదేవీలు పూర్తిచేసుకుని తమ ఊరికి బయలుదేరాడు వర్ధనయ్య. కనకయ్య మనుషులు చూపించిన ఆదరణకు సంతోషపడిన వర్ధనయ్య కొంత ధనం ముట్టజెప్పబోయాడు. దానిని సున్నితంగా తిరస్కరించాడు కనకయ్య.

తమ ఊరు వెళ్ళే దారిలో పండితుడు ఎదురయ్యాడు వర్ధనయ్యకు. కాంతయ్య సంగతి గుర్తొచ్చి పండితుడిని నిలదీశాడు వర్ధనయ్య. "రేగుపండు వ్యక్తిత్వమన్న కాంతయ్యలో మచ్చుకైనా మానవత్వం లేదు. అనేక కష్టాలు పడ్డాను. కొబ్బరికాయ వ్యక్తిత్వమన్న కనకయ్యలో బంగారం లాంటి బుద్ధి , గుణం వున్నాయి. మనుషుల్ని అంచనా వేయడంలో సాధారణ మానవులు పొరపాటుపడడం సహజం. మీలాంటి పండితులు సరైన అంచనా వేయకపోవడం ఘోరం అన్నాడు వర్ధనయ్య.

పండితుడికి పాత సంగతి గుర్తు తెచ్చుకోవడానికి కొంత సమయం పట్టింది. తరువాత గట్టిగా నవ్వి పొరపాటు నాది కాదు మీది అన్నాడు. వస్తున్న కోపాన్ని తమాయించుకుని పండితులైన మీరే అసత్యము పలకవచ్చా? కాంతయ్య వ్యక్తిత్వం రేగుపండుతో తమరు పోలచలేదా? అని అడిగాడు వర్ధనయ్య.

పొరపాటు మీలోనే వుంది. మంచి మనసు గల ఉత్తములు కొబ్బరికాయ వంటి వారు. పైకి కటుగ్గా వున్నా వారి అంత:కరణ రసమయంగా వుండి, లోకోపకార దృష్టి కలదిగా వుంటుంది. కొందరు మనుషులు పైకి తీయని మాటలు చెబుతూ, లోపల కటువుగా స్వార్ధబుద్ధితో వుంటారు. రేగు పండు ఎర్రగా పైకి కనబడుతుందేగానీ, దానిలో వున్నది కఠినమైన గింజ అన్నది గుర్తుపెట్టుకోవాలి. నేను అదే భావంతో చెప్పాను. మీరు అన్వయించుకోవడం లోనే పొరపాటు జరిగింది వివరణ ఇచ్చాడు పండితుడు.

పండితుడి మాటలు విన్న వర్ధనయ్యకు పొరపాటు తన లోనే వుందని బోధపడింది.




"ఏమండీ. . . ఏమండీ .. . ప్లీజ్ ప్లీజ్" ముందుకు వెళుతున్న విజయ్ చేయిపట్టుకొని అన్నాను .

" ఊ . . . వెళ్ళు " అన్నారు విజయ్.

"థాంక్యు. ఎంతైనా మా అయన చాలా మంచివారు. బంగారు కొండ" అన్నాను.

"ఎందుకూ కిటికీ సీట్ ఇచ్చినందుకా? ఇవ్వక పోతే బతకనిస్తావా, దారంతా గొణుగుతూనే వుంటావు." అన్నారు చిన్నగా నవ్వుతూ.

నేనూ నవ్వుతూ లోపలకు వెళ్ళి, కుర్తీ సరిగ్గా సద్దుకొని కూర్చుంటూ కిటికీలో నుంచి బయటకు చూసాను. కొద్ది దూరంలో, అక్కడక్కడ రెక్కలు సాచి, వెండి రంగులో, ఎండకు మిలమిలా మెరుస్తూ రాయంచలా నిలబడి వున్నాయి మబ్బుల పల్లకీలు ( విమానం కు నేను పెట్టుకున్న ముద్దు పేరు ). వాటిని అలా పరవశంగా చూస్తూ వుండి పోయాను. అందులో ఒకటి చిన్నగా స్టార్ట్ అయ్యి ముందుకు, చిన్నగా పరుగు మొదలు పెట్టింది. దానిని అలా చూస్తూ వుండగా మనసు గతంలోకి పరుగెత్తింది.

అది 1972 వ సంవత్సరము. అప్పుడే బంగ్లాదేశ్ యుద్ధము ముగిసి శాంతి నెలకొంటున్న రోజులు. సరిహద్దులల్లో ఇంకా పూర్తి ఉద్రిక్తత తగ్గలేదు. ఆ సమయము లో మా వారికి సరిహద్దు ప్రదేశంలో ఒకటైన షిలిగురి నుండి వెళ్ళే ఆర్మీ కాంప్ కు పోస్టింగ్ వచ్చింది. వక పక్కన శత్రు రాజ్యం బంగ్లా దేశ్, వేరే పక్కన ఇతర దేశాలైన భూటాన్ , సిక్కిం లు కనుక అప్రమత్తంగా ఉండాలని, కుటుంబాలను పర్మిట్ చేయలే. యుద్ధం ముగిసినా ఉద్రిక్తత తగ్గలేదు కాబట్టి ఆంక్షలు ఇంకా పూర్తిగా సడలించ లేదు. దాన్ని ఇంకా పీస్ స్టేషన్ కా మార్చలేదు కాబట్టి కుటుంబాలను, దగ్గరలోనే వున్న డార్జ్ లింగ్ లో సెపరేటెడ్ ఫామిలీ క్వాటర్స్ లో వుండవచ్చు అన్నారు. కాని అక్కడకూ ఆయన ఏ రెండు మూడు నెలలకో కాని రాలేరు. అప్పుడు చంటి పిల్లతో వక్కతే అక్కడ ఎలా వుంటుంది వద్దు అని పెద్దవాళ్ళు , ఇక పోతే బి.యే పూర్తి చేయ వలసిన బృహత్కార్యం నా భుజ స్కందాలపైన వుండటం వల్లనూ, నేనూ మా అమ్మాయి హైదరాబాద్ లోనే వుండిపోయాము. ఆయన సంవత్సరానికి రెండు నెలలు సెలవల్లో వచ్చి వెళుతుండేవారు. ఇలా రెండు సంవత్సరాలు గడిచాయి..పోయిన సారి వచ్చివెళ్ళిన తరువాత, మా అమ్మాయి డాడీ అని ఏడ్చినప్పుడు మా వారి ఫొటో చూపించి ఏవో కథలూ కాకర కాయలు చెబితే వూరుకుంది కాని ఈ సారి చాలా బెంగ పెట్టుకుంది. ఏమి చేయాలో మాకు తోచటం లేదు.ఆయన వచ్చివెళ్ళి నాలుగు నెలలైనా బెంగ తగ్గ లేదు. పోని ఆయనతో మాట్లాడిద్దామంటే ఈరోజుల్లా ఫోన్ల కాలం కాదు. ఉత్తరాలే గతి. అవీ పోస్టల్ వాళ్ళ దయా, మా ప్రాప్తం అన్నట్లూ నిక్కీ నీలిగీ తీరికగా వచ్చేవి! అప్పుడేమైందంటే. . . . .

ఓ రోజు పొద్దున్నే కాలేజికి వెళుదామని పుస్తకాలు తీసుకొని బయటకు వస్తున్నాను. నా వెనుక మా అత్తగారు ఏదో చెబుతూ వస్తున్నారు. ముందు వరండాలోకి వచ్చాము. అక్కడ మా మామగారు కూర్చొని పేపర్ చదువుకుంటున్నారు. ఇంతలో . . .

"టెలిగ్రాం" అంటూ వచ్చాడు . . .పోస్ట్ మాన్. ఒక్క వుదుటన మా మామగారు లేచి ఎక్కడి నుంచి బాబూ అని అడిగారు.

"కాప్టెన్. విజయ్ దగ్గర నుంచండి."అన్నాడు పోస్ట్ మాన్

ఆ అని వణుకుతున్న చేతుల తో టెలిగ్రాం అందుకున్నారు మా మామగారు.

గోడను పట్టుకొని నేను, నా భుజం గట్టిగా పట్టుకొని మా అత్తగారు వణుకుతూ నిలబడ్డాము.

ఆ టెలిగ్రాం నన్ను చదవమన్నట్లుగా అమ్మాయ్ అంటూ నావైపు చాచారు మామయ్యగారు. నేను అప్పటికే ఫేంట్ అయ్యే ప్రోగ్రాం లో వున్నాను!

ఇక తప్పక ఆయనే విప్పి చదివారు."సుమతిని, పూజను     కలకత్తా లో రిసీవ్ చేసుకుంటాను." అని వుంది అందులో. ఇదేమిటి? ఏమి జరిగింది? మమ్మలిని కలకత్తా లో రిసీవ్ చేసుకోవటం ఏమిటి?అంతా అయోమయం లో పడ్డాము. కళ్ళ నీళ్ళ తో అత్తయ్య గారు కుర్చీలో కూలబడ్డారు. మామయ్య గారు ఆ టెలిగ్రాం ను అటు తిప్పి ఇటు తిప్పి అలోచనలో వున్నారు. నేను పుస్తకాలు పక్కన పడేసి , గోడ కు వంటి కాలి మీద ఆనుకొని నిలబడి గోళ్ళు కొరికేస్తున్నాను.

చిన్నారి వచ్చి కాళ్ళకు చుట్టుకొని అమ్మా ఆకలి అంది. అప్పుడు గమనించాము పొద్దుటి నుంచి అలాగే వున్నామని, భోజనాలు చేయాలని! "ఏ పాటు తప్పినా సాపాటు తప్పదు కానీయండి భోజనం చేద్దాం" అన్నారు మామయ్య గారు.

మమ్మలిని ఇంకా అయోమయావస్తలో వుంచటం ఇష్టం లేక పోస్టల్ వాళ్ళు మధ్యాహ్నం పోస్ట్ లో వుత్తరం ఇచ్చేసారు పాపం. మళ్ళీ గుండె దడ మొదలు ఎందుకంటే అది మామూలు కవరు కాదు బ్రౌన్ కలర్ పొడవాటి కవర్ మామయ్య గారి పేరు మీద వుంది! చిన్నగా, జాగ్రత్తగా చించారు. అందులో నుంచి పొడవుగా మడత పెట్టి వున్న రెండు అట్ట ముక్కలు వక ఉత్తరము బయటకు వచ్చాయి., పూజ చాలా మనాది పడ్డది కాబట్టి ఒక వారము రోజులు తన దగ్గరలో ఫామిలీ ని వుంచుకునేందుకు పర్మిషన్ తీసుకున్నాని, (కూతురే మనాది పడిందా నేను కాదా కొంచం కినుకగా అనుకున్నాను.) విజయవాడలో, కలకత్తా లో రైళ్ళు మారి నాలుగు రోజులు వక్కతే ప్రయాణం చేయటం కష్టం కాబట్టి విమానం టికెట్లు పంపుతున్నానని, ఫలానా రోజు అక్కడ వాళ్ళిద్దరిని విమానం ఎక్కిస్తే , కలకత్తాకు నాలుగు గంటల్లో చేరుకుంటుంది, తనను రిసీవ్ చేసుకోవటానికి నాకు వచ్చేందుకు వీలు కాకపోతే, కలకత్తా ఏర్ పోర్ట్ కు వక సిపాయిని పంపిస్తానని, అతను యూనిఫారం లో వుంటాడు, సుమతి పేరు వున్న అట్టను పట్టుకొని వుంటాడు కాబట్టి అతనిని కనుక్కోవటం సులభం , అతను జాగ్రత్తగా ఇక్కడకు తీసుకు వస్తాడు అని     ఆ వుత్తరం సారాంశం!

సిపాయి కాకుండా తనే వచ్చి రిసీవ్ చేసుకుంటానని టెలిగ్రాం ఇచ్చారన్న మాట! ఐతే టెలిగ్రాం బులెట్ లా, ఉత్తరం తాపి

గాటెలిగ్రాం ముందు, ఉత్తరం వెనకలా ముందు వెనుకల వచ్చాయన్న మాట.

మామయ్య గారి దగ్గర నుంచి ఉత్తరం తీసుకొని, గదిలోకి వెళ్ళి ఉత్తరం మళ్ళీ చదివాను. అంతా నేను ఎలా రావాలో, ఏమేమి తెచ్చుకోవాలో వ్రాసి ఉంది. పూజ గురించి వ్రాసారు కాని నా గురించి కాని, నాకు వేరే ఉత్తరం కాని ఏమీ లేదు! కొంచం నిరాశగా అనిపించి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఉత్తరంలో నుంచి చిలిపిగా నవ్వారు. ఊ అనుకొంటూ తల పక్కకు తిప్పుకున్నాను. నా గడ్డం పట్టుకొని, నా మొహం తన వైపు తిప్పుకుంటూ "అలిగావా ?" అని అడిగారు.

"కాదా మరి నాకస్సలు ఉత్తరమే వ్రాయ లేదు. అంతా మామయ్య గారికే వ్రాసారు. నేను మీ ఉత్తరం కోసం ఎంత ఎదురు చూస్తానో తెలుసు కదా! " అలుకగా అన్నాను.

"నిజమేననుకో కాని నిన్ను రమ్మని నీకు వ్రాస్తే బాగోదు కదా! నాన్నకు చెప్పాలిగా! అందుకని నాన్నకు రాసాను." అన్నారు.

"మీరన్నీ అంతే చేస్తారు. సెపరేటెడ్ ఫామిలి క్వాటర్స్ లలో కూడా బాగుంటుందిట. లేడీస్ అందరూ కార్డ్స్ అనీ, క్లబ్లనీ ఎంజాయ్ చేస్తారుట. అంతా చక్కగా కలిసి మెలిసి వుంటారుట. పిల్లలకూ కంపెనీ వుంటుందిట. మిలిట్రీ కాంప్ కాబట్టి సెక్యూరిటీ బాగా ఉంటుందిట. మొన్న బజార్ లో మిసెస్. చెడ్డా కనిపించించి చెప్పింది. నువ్వెందుకు వెళ్ళలేదు అని అడిగింది. పైగా మీరూ అప్పుడప్పుడూ కనిపిస్తూ వుంటారు. ఇక్కడికైతే సంవత్సరం దాకా రారు. ఇంకా సంవత్సరం గడవాలి . అప్పుడు కాని పోస్టింగ్ రాదు. మీరేమొ నువ్వు గ్రాడ్యుయేట్ కావాలి అని కాలేజ్ లో చేర్పించి వెళ్ళారు. ఇప్పుడు పది రోజులున్నా మళ్ళీ 8 నెలల దాకా కనిపించరు. ఇక నా వల్ల కాదు ఇలా వంటరిగా వుండటం." విచారంగా చెప్పాను.

"మరి నేను ఉండగలనా? మిమ్మలినందరినీ వదిలి ఈ అడవిలో ఉంటున్నాను. మొన్న బల్ బీర్ చెప్పాడు, ఇంటికి వెళితే "మమ్మీ ఎవరో అంకుల్ వచ్చారు "అన్నాడుట కొడుకు! ఎంత బాధ! మిలిట్రీ వాళ్ళు ఇంతే వుంటారు. మరి అడ్జెస్ట్ కావాలి. రాత్రి పూట బీర్ +మగ్ తీసుకొని టెంట్ ముందు కూర్చుంటే, పైన చంద్రుడు వెన్నెలలు కురిపిస్తూ వుంటాడు. అడవి పూల సువాసనలు తేలి వస్తూ ఉంటాయి. వాతావరణం ఎంత ఆహ్లాదంగా ఉంటుందో తెలుసా! నిన్నెంత మిస్ అవుతానో! ఈ వెన్నెలంతా దండగైపోయింది కదా అనిపిస్తుంది."నవ్వారు విజయ్.

"అయ్య గారికి కవిత్వం కూడా వస్తోంది." నవ్వాను నేను.

"సుమతీ" మామయ్య గారి పిలుపు వినిపించింది. ఉలిక్కి పడ్డాను. ఓ ఇదంతా కలా నిరాశగా అనుకున్నాను. చేతిలోని ఉత్తరమూ, టికెట్లూ మసక మసకగా కనిపించాయి. కళ్ళు తుడుచుకున్నాను."నీవు వచ్చేవని నీ పిలుపే విని కన్నుల నీరిడి కలయ చూసితిని." అనుకుంటూ లేచి బాత్రూంలోకి వెళ్ళి మొహమూ కళ్ళూ కడుక్కొని బయటకు వెళ్ళాను.

గాబరా ఏమీ లేదని తెలిసాక మళ్ళీ చర్చ మొదలైంది. అప్పటికే ఐదవ నెల కనుక సీమంతానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాము, ఇప్పుడు పంపిస్తే ఎలాగా ? మళ్ళీ అది తిరిగి వచ్చే సరికి ఆరో నెల వచ్చేస్తుంది. మన ఆనవాయితీ ఐదో నెల చేయటమే. ఠాట్ ఇప్పుడు పంపేందుకు వీలు లేదు వాడి కి ఉత్తరం వ్రాసేయండి అన్నారు అత్తయ్య గారు. ఎట్లాగా వాడు టికెట్ పంపాక పంపమని ఎలా చెబుతాము? మీ తల్లి కొడుకులతో చస్తున్నాను మామయ్యగారి ధుమధుమలు! గోడకానుకొని, అడుగూ బొడుగూ గోళ్ళు కొరుకుతూ నేను. కాకపోతే ఈ సారి సీను బయట వరండాలో కాకుండా లోపలి హాల్ లో! సరే తర్జన భర్జన లు, శిఖరాగ్ర సమావేశాల అనంతరం నన్ను పంపేందుకూ, సీమంతం తొమ్మిదో నెలలో చేసేందుకూ నిర్ణయాలు జరిగి పోయాయి.

ఆకాశం లో కనిపించే విమానం ఎక్కుతున్నానంటే చెప్పలేనంత ఎక్సైట్ మెంట్! ఎంచక్కా కిటికీ లో నుంచి మబ్బులు పట్టుకోవచ్చేమో! మబ్బులు ఎలా వుంటాయి? మబ్బుల్లో తేలి పోయాను. మా అమ్మాయిని బయటకు తీసుకెళ్ళి చుక్కలా దూరం గా కనిపిస్తున్న విమానం చూపించి మనం అందులో డాడీ దగ్గరకు వెళుతున్నాము అని చెప్పాను. మా అమ్మాయి ఎగిరి గంతేసింది. మల్లీశ్వరి లోని మబ్బుల పాటలు గుర్తొచ్చాయి. నేను కాలేజి లో ఫ్రెండ్స్ తో, మా అమ్మాయి ఇంటికొచ్చిన వాళ్ళందరితో మా విమాన ప్రయాణం గురించి డప్పు కొట్టేసాము.

ఎదురు చూస్తున్న శుభ గడియ వచ్చేసింది. సూట్ కేస్ బయటకు తెస్తుంటే మా వారు నాకు ఇవి తేకు అవి తేకు, భోజనం కూడా విమానలో పెడుతారు అంటూ వ్రాసిన బోలెడు జాగ్రత్తలు గుర్తొచ్చాయి. ఆయన పిచ్చి కాకపోతే నేనేమన్నా పార్వతీశాన్నా నల్ల ట్రంక్ పెట్టె, మర చెంబు, గొడుగు గట్రా పట్టుకు పోవటానికి! ఎలా తయారవ్వాలి అన్న మీమాంస లో పడ్డాను. పూజ కైతే మావారు తెచ్చిన గళ్ళ పినోఫాం వేసాను కాని నాకే ఓ పట్టాన తోచటం లేదు. చక్కగా చీర టైట్ గా కట్టు కొని, పెద్ద నల్ల కళ్ళద్దాలు పెట్టుకొని, తలకు స్కార్ఫ్ కట్టుకొని విమానం మెట్లెక్కి , తలుపు దగ్గర నిలబడి చేయి అలవోకగా వూపే హీరోయిన్లు గుర్తొచ్చారు. నేనూ అలా తయారవుదామని సరదా పడ్డాను కాని అమ్మో ఇంకేమైనా వుందా? గంజి పెట్టిన వెంకట గిరి చీరో, బెంగాల్ కాటనో కట్టుకుంటే మరీ ముసలమ్మలా కనిపిస్తానేమొ! చీరలన్నీ అటుతిప్పి ఇటు తిప్పి సీమంతానికి మా అమ్మ తెచ్చిన లేత పసుపు రంగు జార్జెట్ చీర తీసాను. జాకెట్ కుట్టించుకోమని అమ్మ ఇచ్చి పోయింది. ఎలాగూ సీమంతం ఇంకా నాలుగు నెలలు వుంది కదా ఇంకోటి కొనుక్కోవచ్చులే అనుకొని అదే కట్టేసాను. మమ్మలిని విమానం ఎక్కించటానికి మామయ్యగారు, పనివాడు వచ్చారు.

విమానం దగ్గరకు వెళ్ళాము. . . . .

మెట్లెక్కాము. . .      లోపలి కివెళుతూ తలుపు దగ్గర నిలబడి తిరిగి చూసాను.. లాంజ్ చాలా దూరంగా వుంది. మామయ్యా గారు ఎక్కడున్నారో తెలిలేదు. వాళ్ళు నాకు కనిపించనట్లే నేనూ వాళ్ళకు కనిపించను కదా స్టైల్ గా చేయి ఊపుదామా అని ఓ క్షణం అనుకున్నాను. అమ్మో నా పక్కన బుజ్జి పిల్ల వుంది కదా వాళ్ళు కనిపెట్టేస్తారేమో! తిరిగి వచ్చేటప్పుడు ఆయన వుంటారు గా ఆయనకు చేయి ఊపొచ్చులే అని సరి పెట్టుకొని లోపలకు వెళ్ళాను.

తలుపు దగ్గర ఏర్ హోస్టెస్ నాజూకుగా నమస్కార్ చేసి లోపలకు ఆహ్వానించింది. ఇంకో ఏర్ హోస్టెస్ మమ్మలిని తీసుకెళ్ళి మా సీట్ దగ్గర కూర్చోపెట్టింది. మా వెనుక ఇద్దరు నన్స్ కూర్చొని వున్నారు. వాళ్ళు పూజను పలకరించారు. వాళ్ళు పిలిచి మాట్లాడించారు. ఎవరైనా మాట్లాడాలే కాని దానికేమీ కొత్తా పాతా లేదు అందరి తో మాట్లాడేస్తుంది. వాళ్ళతో కబుర్లు మొదలు పెట్టింది. ఇంతలో విమానం తలుపు మూసేసారు. ఏర్ హోస్టెస్ వచ్చి పూజను ఎత్తుకొచ్చి నా పక్కన కూర్చో బెట్టి, ఇద్దరికీ బెల్టులు కట్టి వెళ్ళింది. నేను చుట్టూ కలియ చూసాను. నేనూ, ఇద్దరు నన్స్ తప్ప ఆడవాళ్ళెవరూ లేరు అంతా మొగవాళ్ళే! వాళ్ళైన అక్కడక్కడ వున్నారు. ఏర్ హోస్టెస్ ఓ ట్రే లో చాక్లెట్ లు, దూది వుండలు తెచ్చి అందరికీ ఇస్తోంది. పూజ రెండు గుప్పిళ్ళ నిండా చాక్లెట్స్ తీసుకొని తన జేబుల్లో పోసుకుంది. అయ్యో బంగారు అన్ని తీసుకోకూడదు అని నేను గాభరా పడి పోయాను. పరవా లేదు అని ఆమె నవ్వుకుంటూ వెళ్ళి పోయింది. మా వారి ఇన్స్ట్రెక్షన్స్ ప్రకారం దూది నేను రెండు చెవుల్లో పెట్టుకొని పూజ కూ పెట్టాను.

విమానం చిన్నగా కదలటం మొదలైంది. కాస్త పరుగెత్తి ఒక్క జర్క్ తో పైకి లేచింది! గుండె గుభేల్ మంది! పూజ ఒక్కసారే ఉలిక్కి పడి కెవ్ మంది. బెల్ట్ చేత్తో తీసేసేందుకు ప్రయత్నం చేస్తూ గింజుకుంటోంది! నేను దాని చేయి పట్టుకొని ఊరడిస్తున్నాను. విమానం స్టడీ అయ్యాక ఏర్ హోస్టెస్ వచ్చి మా ఇద్దరి బెల్ట్ లూ విప్పేసింది. పూజ ఒక్క ఉదుటన నా వళ్ళోకి దూకి నా మెడ చుట్టూ చేతులు వేసి ఏడవటం మొదలు పెట్టింది. ఎంత ఊరడించినా ఊరుకోదు. నాకేమో ఉక్కిరి బిక్కిరి ఐపోతోంది. ఏర్ హోస్టెస్ వచ్చి ఎత్తుకో బోయింది . ఆమె చేతులు నెట్టేసింది. వెనుక వున్న నన్స్ పిలిచారు ఉమ్...హూ.... వెళ్ళదు. నా వడిలో నుంచి లేవదు. ఒకటే ఏడుపు! ఏర్ హోస్టెస్ ను అడుగుతే పాపం నా హాండ్ బాగ్ లో నుంచి దాని పాల సీసా తీసి ఇచ్చింది. అది నోట్లో పెడితే ఒక్క తోపు తోసేసింది. అలా గంట పైనే అనుకుంటా ప్రయాణం చేసి ఓ ఊరు చేరు కున్నాము. అది ఏ వూరో గుర్తులేదు. అక్కడ ఎక్కువ సేపు ఆగ లేదు. మళ్ళీ ప్రయాణం మొదలు! ఇంకాసేపు గడిచాక భువనేశ్వర్ చేరుకున్నాము. అక్కడ కొద్ది సేపు ఆగుతుంది అని , కిందికి దిగి కాసేపు నడుస్తే ఫ్రెష్ గాలి కి ఏడవటం పూరుకుంటుదేమో అని ఏర్ హోస్టెస్ చెప్పింది. చిన్నగా దాని ని ఎత్తుకొని దిగాను. నేల మీదకు దిగగానే నా మీది నుంచి ఒక్క దూకు దూకి రయ్ న ముందుకు పరిగెత్తింది!

అదృష్టవసాత్తు ఎదురుగా వస్తున్న ఏర్ పోర్ట్ ఉద్యోగి దానిని పట్టుకొని నాకు ఇచ్చాడు. విమానం వద్దు అని ఒకటే ఏడుపు!

మరి డాడీ దగ్గరకు వెళ్ళొద్దా అంటే డాడీ కావాలి, విమానం వద్దు అంటుంది.

ఓ నన్ నా దగ్గరకు వచ్చి నా దగ్గర స్లీపింగ్ టాబ్లెట్ వుంది. ఓ హాఫ్ వేయి పడుకుంటుంది అంది.

అమ్మో స్లీపింగ్ టాబ్లెట్ నా. నాకు స్లీపింగ్ టాబ్లెట్ అంటే చాలా భయం. వద్దండి థాంక్ యు అని చెప్పాను.

విమానం ఎక్కనంటుంది. భువనేశ్వర్ లో ఎలా దిగను? ఏమి చేయను ? అంతా అయోమయం. ఏర్ హోస్టెస్ సహాయంతో కష్టం మీద విమానం ఎక్కాను. ఏర్ హోస్టెస్ చాక్లెట్స్ తెచ్చింది. ఏమనుకుందో ఏమో కాని మా అమ్మాయి తన దగ్గర వున్న చాక్లెట్స్ కూడా తీసి ఆ ట్రే లో వేసేసింది. ఏడుపు తగ్గలేదు. నా వడిలో నుంచి దిగదు. ఏడ్చీ ఏడ్చీ తోటకూర కాడ లా వడిలి పోయింది. కళ్ళూ ఎర్రబారి , కళ్ళూ మొహమూ వాచిపోయాయి. ఇంక ఏడ్చే ఓపిక లేదేమో వెక్కిళ్ళు పెడుతోంది. నాకూ ఓపిక ఐపోయింది. ఏర్ హోస్టెస్ అటు వచ్చినప్పుడల్లా ఇంకెంతసేపు అని అడగటమే! పొద్దున్నా ప్రయాణం సరదాలో మా అత్తగారు వట్టి పిల్లవు కూడా కాదు, వాళ్ళు పెడితే ఏం పెడుతారో తినిపో అంటే కష్టం మీద సగం చపాతి తిన్నాను. ఇక్కడ వాళ్ళు పెట్టినవి తను తినలేదు నన్ను తిననీయలేదు నా కూతురు. నీరసం వస్తోంది . కళ్ళు తేలి పోతున్నాయి. అమ్మయ్య ఎట్టకేలకు కలకత్తా చేరుకున్నాము. లేచి నిలబడ లేను. కాళ్ళూ, నడుమూ పట్టేసాయి. పిల్ల చంక దిగదు. చాలా అంటే చాలా కష్టం మీద ఏర్ హోస్టెస్ సహాయము తో దిగి బస్ ఎక్కాను.

అమ్మయ్య అదిగో అక్కడ మా వారు కనిపిస్తున్నారు. అప్పటి వరకూ గొంతులో సుళ్ళు తిరుగుతున్న ఏడుపు బయటకు వచ్చేస్తోంది. ఆయన దగ్గరకు ఎలా వెళ్ళామో తెలిదు! డాడీ అంటు మా అమ్మాయి, ఏమండీ అంటూ నేను ఇద్దరమూ ఆయనను వాటేసుకొని భోర్ మన్నాము!

మబ్బుల పల్లకీ లో నా మొదటి ప్రయాణం అలా బీభత్సం గా మొదలై బీభత్సంగా ముగిసింది!

విమానం ఎక్కిన ప్రతి సారి అది గుర్తొస్తుంది. మేమిద్దరమూ మీద పడి భోర్ మనగానే విజయ్ పడ్డ కంగారు గుర్తొస్తే నవ్వొస్తుంది. చిన్నగా నవ్వుతున్న నన్ను చూసి "ఏమిటి నీ మొదటి ప్రయాణం గుర్తొచ్చిందా?" అని అడిగారు విజయ్.

"ఊ! అప్పుడంత గోల గోల చేసిందా, ఇప్పుడేమో పెద్ద డైరక్టరై నెలకు పది రోజులు మబ్బుల పల్లకీ లోనే ఊరేగుతూ వుంటుంది మీ కూతురు ." అన్నాను నవ్వుతూ.

"మరి నా బంగారు తల్లి కదా!" మురిపెంగా అన్నారు విజయ్.




మా పోతరాజు చాలా జాలి గుండె కలవాడు. మా స్నేహితుడని కాదు కానీ చిన్న తనం నుంచీ వాడిది జాలి గుండె. ఎవరైనా కష్టంలో ఉన్నా, బాధ పడుతున్నా ఓర్చుకోలేడు. తన బాధ లాంటిదే కదా వారిదీనీ అని సాయం చేయను ముందుకొచ్చేవాడు. ఒక్కో మారు అది 'తనను మాలిన ధర్మం' గానూ ఉంటుండేది. వాడూ నేనూ ప్రాధమిక స్థాయి నుండీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకూ క్లాస్ మేట్లమూ, బెంచ్ మేట్సుం కూడా . వాడి జాలి గుండె మొదటి సారిగా మేము మూడో క్లాస్ లో ఉన్నపుడు బయట పడింది నాకు తెల్సి. నాకు బాగా గుర్తు ఆ రోజు. చలి కాలం . అందరికీ ముక్కులు కారుతున్నాయి, వాళ్ళమ్మ వాడికి ముక్కు తుడుచు కోను చేతి రుమాలు ఇచ్చింది.

ముక్కు కారి ఎండి పోతే అది చాలా బాధగా ఉంటుంది. ఆ రోజు వాడూ నేనూ బడి కెళ్ళి సంచులు మా స్థలంలో ఉంచుకుని , ప్రార్ధనకు బయటికొచ్చాం. మా బడి చిమ్మే బాలమ్మ కొడుకు కుమారు మా వయసు వాడే వాడికీ ముక్కు కారుతుంటే వాళ్ళమ్మ వెనకాలే తిరుగుతూ ఆమె చీర చెంగుతో ముక్కు తుడుచుకోసాగాడు. ఆమె వాడ్ని కోప్పడుతూ, "వెనకెనకాలే తిరగమోకురా వెధవా! , నా పనికి ఆలీస్సెమవుతుంది, పెద్ద పంతులొస్తే కోప్పడతారు "అంటూ అరుస్తున్నది. మా పోత రాజు చూశాడు, వాడి ముక్కు ఎర్రగా ఐపోయి రక్తం కూడా వస్తున్నది, బాలమ్మ చీరె చాలా మందంగా ఉంది, వెంటనే వాడు మా తరగతి గదిలోకి పరుగెట్టి తన సంచీలో ఉన్న వాడి చేతి రుమాలు తెచ్చి కుమారుకిచ్చి, "ఇది తీసుకో మెత్తగా ఉంటుంది, రక్తం రాదు , నొప్పేయదు" అని చెప్పాడు.అది వాడి మొదటి జాలి గుండె రెస్పాన్స్. ఇంటికెళ్ళాక వాళ్ళమ్మకు చెప్పగా ఆమె "పోనీలేరా !

పోతు రాజూ! అవసరంలో ఉన్న వారికి అలా సాయం చేయడం మంచిదే, మనం ఇతరులకు సాయం చేస్తే దేవుడు మనకు సాయం చేస్తాడు." అంది. అలా వాళ్ళమ్మ ఉగ్గు పాలతో జాలి నూరి పోయడం వల్ల వాడి జాలి గుండె ప్రవాహం మొదలైంది. ఆ తర్వాత వాడు చేసే సాయాలు చాలానే ఉండేవి, పెన్సిళ్ళు ఎక్కువగా తెచ్చే వాడు , అవసరమైన వాళ్ళకు అచ్చంగా ఇచ్చేవాడు.

ఇహ ఎరేజర్స్ కూ, బలపాలకు లెక్కేలేదు, ఎవరికి కావల్సినా పరుగు పరుగున వచ్చి పట్టుకెళ్ళే వారు, ఒక్కో మారు ఉపాధ్యాయులు కూడా బలపం కావాల్సిన వాళ్ళను "వెళ్ళి పోత రాజు దగ్గర తెచ్చుకో పో " అని పంపే వారు. అలా సాయానికి మారు పేరుగా మా పోతరాజు చిన్నతనం నుంచే పేరు పొందాడు. ఐదో క్లాస్ లో ఉండగా పోతరాజు పుట్టిన రోజుకు వాళ్ళమ్మ కొనిచ్చిన కొత్త చెప్పులు, ఆ సాయం కాలం బడ య్యాక ఇంటి కెళుతుండగా కాళ్ళకు చెప్పుల్లేకుండా గాయమైన కాళ్ళతో వెళుతున్న ఒక వీధి కుర్రాడ్ని చూసి అవి ఇచ్చేశాడు."చూడరా రఘూ! పాపం కాలికి గాయమైందిరా!ఎలా నడుస్తాడూ!" అని జాలి మాటలు కూడా జోడించాడు. ఇంటికెళ్ళాక వాళ్ళమ్మ కోప్పడుతుందని అనుకున్నాను. ఆమె వాడిని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంది. "పోన్లే నాయనా! మరో జత కొంటాగా!"అంది."ఇలాంటి అమ్మలు కూడా ఉంటారా!' అని ఆశ్చర్య పోయాను. వాడి జాలి గుండెకు మూలం ఆమే అని నిదానంగా తెల్సింది

నాకు. హై స్కూల్ కెళ్ళాక వాడి జాలి ప్రవాహం ఎక్కువ కాసాగింది వర్షా కాలపు కృష్ణా గోదావరుల్లా. నోట్ బుక్కులూ, అచ్చు పుస్తకాలూ , పెన్ లూ అరువుగా కాక అచ్చంగా ఇచ్చేవాడు, అచ్చు బొక్కులు మళ్ళా వాళ్ళమ్మ కొనిచ్చేది. ఏడో క్లాస్ లో ఉండగా పరీక్ష ఫీజ్ కట్ట లేని ఇద్దరికి వాళ్ళమ్మనడిగి కట్టి సాయం చేశాడు. అలా వాడి పేరు స్కూలంతా తెల్సిపోయింది. బడికి రాని వాళ్ళకు నోట్సు వ్రాసివ్వడం, రికార్డులో డ్రాయింగ్ లు వేసివ్వడం చేసేవాడు. వాడు లెక్కల్లో దిట్ట. చేతి వ్రాత ముత్యాల వరుసలే. చాలా మంది వాడి చేత నోట్లు వ్రాయించుకోను కావాల్ని బడి మానేవారు."పోత రాజూ! నిజంగా అవసరమైన వాళ్ళకే చేయరా! నీ జాలిని వాళ్ళు దుర్వినియోగం చేసుకుంటున్నారు" అని నేనంటే," పోనీరా రఘూ! నాకూ చదవకుండానే బాగా వచ్చేస్తుంది కదా! ఒక మారు వ్రాస్తే పదిమార్లు చదివినట్లుట కదా!"అని ఓపిగ్గా వ్రాసిచ్చేవాడు.

ఒక మారు వాళ్ళ నాన్న గారు ఊర్లో లేనపుడు, వాళ్ళమ్మ పోస్టాఫీస్ కెళ్ళి వాళ్ళ అక్క గారికి అతి జరూరుగా సొమ్ము పంపాల్సి వచ్చి , మనియార్డర్ చేయను చేత కాక ఇబ్బంది పడిందిట, అప్పుడు మా పోతరాజు ఎనిమిదేళ్ల వాడు. వాళ్ళమ్మ పడిన బాధ చూసి వాడికి బాధేసిందిట, వాళ్ళమ్మ "నాయనా ! నీవు పెద్దయ్యాక వీలుంటే పోస్టాఫీసు వద్ద చదువు రాక చిరునామాలూ, మనియార్డర్ లూ వ్రాసుకోను రాని వారికి సాయం చేయరా బాబూ!" అందిట. అది బాగా గుర్తు పెట్టుకున్నాడు మా పోత రాజు. అమ్మ మాటంటే వానికంత గురి. ఎనిమిదో క్లాసులో ఉండగా , మనియార్డర్ లు చేయడం, చిరునామాలు వ్రాయడం వంటివి మా సార్లు పోస్టాఫీసుకు తీసుకెళ్ళి నేర్పినప్పట్నుంచి , మా పోతరాజు తీరికున్నప్పుడల్లా పోస్టాఫీసు కెళ్ళి సాయం చేసే వాడు. పదో క్లాస్ లో ఉండగా ట్యూషన్ పెట్టించుకునే స్థోమత లేని వారికి బడయ్యాక లెక్కలు నేర్పేవాడు, అలా వాడికి చెప్పి చెప్పి , పాఠ్యాంశాలు అలవోకగా నోటికొచ్చి స్టేట్ ఫస్ట్ వచ్చాడు. వాడికి చదువు చెప్పడం ఒక హ్యాబీ గా మారింది. అందుకే ఇంటర్ లో సైన్స్ గ్రూప్ తీసుకుని, బిఎస్సీ చేశాడు, ఆ తర్వాత ఎమ్మెస్సీ కూడానూ. నేను వాడి స్నేహం వదులు కోలేక వాడితో పాటే చదివాను. ఇద్దరికీ లెక్చరర్ పోస్టులు వచ్చాయి,

కానీ వేరే వేరే ఊళ్ళలో. అలా మా స్నేహానికి తాత్కాలిక దూరం ఏర్పడింది. క్రమేపి వివాహం, సంసారం, సంతానం ఏర్పడ్డాక, ఫోన్ సౌకర్యాలూ గట్రా వచ్చాక అప్పుడప్పుడూ వ్రాసుకునే ఉత్తరాల స్థానంలో ఫోన్ సంభాషణలు పెరిగాయి. వాడికి ఇద్దరు కొడుకులు, నాకు ఒక కూతురు, ఒక కొడుకూనూ. ఐతే మా పోత రాజు జాలి గుణం మాత్రం తగ్గక పోగా వయస్సుతో పాటుగా పెరగ సాగింది. ఎందరో తన విద్యార్థులకు ఉచిత ట్యూషన్ తరగతులు, పేద విద్యార్థులకు ఫీజులూ కట్టేవాడు, వాడి జీతంలో పదో వంతు సేవలకు అట్టే పెట్టే వాడు. చలి కాలంలో ఆది వారాలు ఒక బ్యాగ్ లో చీరలూ, దుప్పట్లూ పెట్టుకుని పేవ్ మెంట్ మీది వారికి ఇచ్చేవాడు, వేసవిలో పాదరక్షలు ఇచ్చే వాడు. వీలున్నప్పుడల్లా భోజనం పొట్లాలు పేవ్ మెంట్ మీది ముసలి ముతకాలకూ, అంగ వైకల్యం ఉన్న వారికీ ఇచ్చి వచ్చే వాడు. అలా ఎంతో మందికి వాడి ఆశీర్వాదాలు అందుతూనే ఉండేవి. అప్పుడప్పుడూ ఫోన్ లు చేసుకున్నపుడు వాడు తాను చేసే ఈ చిన్ని చిన్ని సాయాల గురించి నేను అడగ్గా అడగ్గా చెప్పేవాడు. ఏ పని మీద వెళ్ళినా సమయానికి తిరిగి వస్తాడనే నమ్మకం ఇంట్లో వాళ్ళకు ఏనాడో పోయిందని మా చెల్లెమ్మ అప్పుడప్పుడూ మాట్లాడినపుడు చెప్పేది. ఎవరు ఏ సాయం కోరినా మా పోతరాజు కాదనడు, అది వాడి నిఘంటువులో లేనే లేదు.

మా ఇద్దరికీ ఓ శుభ ముహూర్తాన ఓ ఆలోచన వచ్చింది. మాలాగే మా సంతానాన్నీ స్నేహితులను చేయాలని. అందుకే వాళ్ళను పరాయి ఊరైనా ఒకే కాలేజీలో వేద్దామని నిర్ణయించాం. వాడికి అప్లికేషన్ పంపి , పోస్టాఫీస్ కు వెళ్ళి మని యార్డర్ చేసి, అప్లికేషన్ పూర్తి చేసి మనియార్డర్ రసీదూ కలిపి పోస్ట్ చేయమని చెప్పాను. చివరి తేదీ దగ్గర పడింది. "ఏరా !పోత రాజూ ! మూడు రోజులే ఉందిరా! ఇంకా పంప లేదా!"అని ఫోన్ చేయగా ,"ఒరే రాఘువా! వారం నుంచి వెళ్తూనే ఉన్నా రా! అక్కడ అడ్రస్ వ్రాసుకోను చేతకాని వాళ్ళూ, ఫారం ఫిలప్ చేయను రాని వాళ్ళూ, ఏవో అర్జంట్ పార్సిల్స్ పంపను చిరునామా ఆంగ్లంలో వ్రాయను చేత కాని వారూ పాపం ఇబ్బంది పడుతుంటే సాయం చేసే సరికి నాలైన్ పోతున్నది, కాలేజ్ టైమై పోతున్నది , ఈ రోజు తప్పక కడతానుగా!" అన్నాడు. అలా కాదని వాడి కొడుకుని పిల్చి వాళ్ళ నాన్నతో ఈరోజుకు వెళ్ళమని చెప్పాను. పోస్టాఫీసుకు వెళ్ళగానే పోతరాజును చూసి, చాలా మంది చుట్టూ మూగారుట. వాళ్ళను తప్పించుకు పోను వాడి వల్ల కాలేదుట. పైగా చెల్లాయి చెప్పిన మాటలు వింటే నాకు నవ్వు ఆగింది కాదు. "పోత రాజూ! పోస్టాఫీసుకా?నాక్కాస్త ఒక ఐదు రూపాయలకు కార్డులు తెచ్చిద్దూ !" ,

"పోత రాజూ! పోస్టాఫీసుకా! ఈ లెటర్స్ పోస్ట్ చేద్దూ , స్టాంపులు అంటించాలయ్యా!" , " పోతరాజూ పోస్టాఫీసుకా! తపాలా బిళ్ళలు తెచ్చిద్దూ !" అంటూ కనీసం పదిమంది ఏదేదో పనులు చెప్పేవారుట. వాళ్ళ పనులన్నీ చేసే సరికి తన పని హుళక్కిట. చివరకు వాని కొడుకునేమని ఆర్డర్ చేయించి, రసీదు, పూర్తి చేసిన అప్లికేషనూ పోస్ట్ చేయమంటే చేసాడు.. తీరా కాలేజ్ కెళ్ళాక " ఏంటీ నీవు పోత రాజు గారి కొడుకువా! మీ నాన్న గారెక్కడ!"అన్నాడా కాలేజ్ కరస్పాండెంట్ . పోత రాజు కొడుకును నాతో పంపమని చెప్పి నేనే తీసుకెళ్ళాను కాలేజ్ అడ్మిషన్ కు. అతగాడికి పోతరాజు పరీక్ష ఫీజ్ కట్టాట్ట ఎప్పుడో, ఇంకేం మా పిల్లలిద్దరికీ సీట్లు ఫ్రీ గానే దొరికాయి.

అలా మా వాళ్ళ కాలేజ్ చదువు పూర్తయ్యాక ఇద్దరూ ఇంజనీర్లయ్యాక , ఒక మంచి కంపెనీలో ఉద్యోగాలు వచ్చాయి. ఉద్యోగంలో చేరిన రోజున ఇంటికొచ్చి మా వాడూ, పోతరాజు కొడుకూ చెప్పిన మాటలు వింటుంటే ఆశ్చర్యమేసింది. ఆ కంపెనీ యజమాని మా

వాడి స్టూడెంటుట. బయోడేటా చూసి కనుక్కుని పోత రాజు కొడుకని తెల్సి మహా సంతోష పడ్డాట్ట అతగాడు. రోజులలా పోత రాజుకు సంఘ సేవ తోనూ, నాకు స్వంత సేవ తోనూ గడచి పోయి, నేనూ పోత రాజూ రిటైరయ్యాం. పక్క పక్కనే ఇళ్ళు కొనుక్కుని బాల్య స్నేహానికి మళ్ళా ప్రోదు చేసుకోసాగాం. ఓ రోజున పోతరాజు ఇంటి ముందు ఒక పెద్ద బెంజ్ కారు ఆగింది. దాన్లోంచి ఓ సూటూ వాలా దిగాడు. ఎవరాని నేనూ వరండాలోకి వెళ్ళాను, చెల్లెమ్మ ఒక్కర్తే ఇంట్లో ఉందని."ఏమండీ! పోతరాజు గారిల్లు ఇదేనాండీ! వారున్నారా ఇంట్లో !" అని అడిగాడతను. "లేరండీ! వారు పోస్టాఫీసు కెళ్ళారు, ఎప్పుడొస్తారో కూడా తెలీదు." అంది చెల్లెమ్మ. అతగాడు "వారింకా ఈ సేవలు మానలేదన్న మాట. సరే నేనక్కడికే వెళ్ళి మాట్లాడుతాను. ట్రంక్ రోడ్ లోని మైన్ పోస్టాఫీసే కదండీ!" అంటూ కారు వేపు కదిలాడాయన.

ఆ తర్వాత ఐనదేంటంటే ఆయన కొడుక్కు మా వాడి కూతుర్ని పైసా ఖర్చు లేకుండా చేసుకున్నాడాయన, మా వాడు చేసిన సేవలకు ప్రతి ఫలంగా. మావాడు సంపాదించే అవకాశం ఉన్నా, డబ్బు సంపాదించక పోయినా మంచి పేరు సంపాదించాడు, వాడి కొడుక్కు ఉద్యోగం, కూతురి వివాహం వాడి సేవా ఫలితంగానే ఐనాయి. వాడు ఇంకా పోస్టాఫీసు సేవలు మాత్రం మానలేదు. పోతురాజు కేరాఫ్ అడ్రెస్ పోస్టాఫీసైంది.




తారు రోడ్ మీద రయ్ మంటూ వెళుతున్న ఆర్టీసీ బస్సు రామాపురం స్టాపింగ్ రాగానే ... గీరుమని శబ్దం చేస్తూ ఆగింది.
" రామాపురం ... రామాపురం ...! " కండక్టర్ కేకేశాడు.

బస్సు వూరి లోపలకు రాదు. దిగి ఓ అర కిలోమీటర్ లెఫ్ట్ రైట్ కొట్టాల్సిందే... !   దిగి ఊరి వైపు నడక సాగించాడు రవి. తలొంచుకొని నడుస్తున్న రవికి వెనక నుండి " బాబూ .. ! " అని పిలుపు వినిపించగా వెనక్కి తిరిగి చూశాడు.

" రామాపురం వూరిలోకి దారి ఇదేనా .. ? అడిగాడు ఆయన.

" ఊ ... ! "   అన్నట్లు తలూపాడు రవి.

పదడుగులు సాగాక ... " యేం చేస్తున్నావు బాబూ ... ! " అడిగాడాయన.

" బి. టెక్ . అయింది. హైదరాబాదులో ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాను. పండగ కదా నాలుగు రోజులు ఉండి పోదామని వస్తున్నాను .. "   చెప్పాడు రవి.

"   హైదరా బాదులోనా ... మావాడు నాగేశం కూడా అక్కడే వున్నాడు. అదేదో కంపినీలో పని చేస్తున్నాడు... " చెప్పాడాయన.

అవునా అన్నట్లు తలూపాడు రవి. కొంచెం సేపు మౌనంగా సాగింది వారి ప్రయాణం. ఆయన   వూరికి కొత్త అని అర్థమైన రవి   " ఎవరింటికి వెళ్ళాలి .... ?   " అని అడిగాడు.   చెప్పాడాయన.

ఆశ్చర్య పోయాడు రవి .... కారణం ఆయన వచ్చేది తమ యింటికే .... !   " ఆయన మీకెలా తెలుసు "   వుండబట్ట లేక అడిగాడు రవి.

" యింతకు ముందు పరిచయం లేదు. యిప్పుడే పరిచయం కాబోతుంది ... " అన్నాడాయన.

తమ యిల్లు వచ్చింది. అప్పటికే వీధిలో ఆడుకుంటున్న అన్నయ్య పిల్లలు తనను గమనించి " బాబాయ్ " అంటూ పరుగెత్తుకొచ్చారు. వారి కేకలకు వరండాలో కూర్చొ నున్న రవి నాన్న తలెత్తి పైకి చూసి ...రవితో పాటు వస్తున్న ఆయన వంక చూస్తూ లేచి వెలుపలకు వచ్చాడు.

" నాన్నా.... ! ఈయన వచ్చింది మీ కోసం. " అని ఆయనను నాన్నకు ముక్తసరిగా పరిచయం చేసి లోపలికెళ్ళాదు రవి. రవిని చూడగానే జానకమ్మ కళ్ళు మెరిశాయి. ఒళ్ళంతా తడుముతూ.. " యేంటి నాన్నా యిలా తగ్గిపోయావు. అక్కడి తిండి నీకు ఒంటబట్టినట్లు లేదు .. ! " అంది. నిజానికి తనేమీ తగ్గలేదు. మరో నాలుగు కేజీలు పెరిగాడు. కాకపోతే తల్లిప్రేమకు అలా అనిపిస్తుంది... అనుకొని నవ్వి సరిపెట్టాడు రవి.

" యెవరన్నయ్యా ఆయన ... వెంటేసుకొచ్చావ్ ... ? " అంటూ వచ్చింది రజని.

" నా కేసు కాదు. నాన్న కోసం వచ్చాడు . అడ్రసు అడిగితే కూడా తీసుకొచ్చాను. అయినా ఆయనెవరైతే నీకెందుకు.... ! "

" దీనికన్నీ కావాలిరా ... పెద్ద ఆరిందాలా ... ! " నవ్వుతూ అంది జానకమ్మ.

ఒక ప్రక్క అమ్మ, మరో ప్రక్క చెల్లాయి, యింకో ప్రక్క వదినా పిల్లలు రకరకాల ప్రశ్నలతో రవిని వుక్కిరిబిక్కిరి చేస్తుంటె ... "' వాడికి నీళ్ళూ, తిండీ చూడరా ... ! చుట్టూ చేరి తినేస్తున్నారు ... ! " వరండాలోంచి నాన్న కేక వేయడంతో తనను వదిలేశారు.

స్నానం చేసి చల్లగా వుంటుందని మేడ మీదికి చేరాడు రవి. వెనకాలే .. రజని కూడా వచ్చి, " అన్నయ్యా ... నాకో డౌటు ... ! " అంది. రజనికి అన్నీ డౌట్సే.

అందరూ ఆమెను 'డౌట్ మేడం .. ' అని ఆట పట్టిస్తూ వుంటారు.

"డౌటా .. యేంటది .. ? " అడిగాడు రవి.

"అదే ... నీతో పాటు వచ్చినతను యెవరు..? ఆయన నాన్నతో యేదో చెప్పాడు. నాన్న వచ్చి అమ్మతో గుసగుసలాడాడు. అసలు విషయం నాకు అంతుపట్టలేదు. యేమై వుండొచ్చు... ! " అంది.

"ఆ.. యేముంది ... నీ పెళ్ళి సంగతై వుండొచ్చు. " నవ్వుతూ చెప్పాడు రవి.

"పూ .. చాల్లే ... ! " అంటూ విసవిసా దిగిపోయింది రజని.

రజనికి అసలు విషయం తెల్సుకోందే నిద్ర పట్టదు. అదేదో తనకి చెప్పిందాకా వదలదు. పిట్ట గోడ ఆనుకొని అలా ఆలోచిస్తూ నిల్చొన్నాడు రవి. కొంతసేపుటి తర్వాత రజని మళ్ళీ వచ్చింది. రాగానే " డౌట్ క్లియర్.. " అంది.

నాకు తెలుసుగా డౌట్ క్లియర్ కాందే నీకు నిద్ర పట్టదని .. " విషయం చెప్పింది రజని. ఆమె చెప్పిన దానిని బట్టి ఆ వచ్చినతనికి ఒక కొడుకు, ఒక కూతురు వున్నారట. తనకి ఇచ్చిపుచ్చుకునే సంబంధం కావాలట. అంటే తమ అమ్మాయిని ఇచ్చిన ఇంట్లోంచే కోడలు కావాలట. అందుకు తమతో సంబంధం కలుపుకోవటానికి వచ్చాడట. రజనికి అనుకొన్నాను ఇది తనకూ తగిలేట్లుందే ... ! అయినా తనకి సమ్మతం కాకుండా నాన్న ఒప్పుకోడు. తనకా నమ్మక ముంది... అని రవి తనలో తాను ఆలోచించుకొంటూండగా . . " రవి .. ఆ మంచులో యెందుకు వచ్చి భోజనం చేసి పడుకో " అంటూ క్రింద నుండి జానకమ్మ పిలిచింది.

క్రిందికి వచ్చి భోంచేసి .. తనకు యేర్పాటు చేసిన మంచం పై పడుకున్నాడు రవి. అప్పటికే ఆ వచ్చినతను తన పక్కనే మంచం మీద పడుకొని .. గురక పెడుతున్నాడు.

రవి నవ్వుకుంటూ మేను వాల్చాడు. ప్రయాణ బడలిక వల్ల వెంటనే నిద్ర పట్టేసింది.

అర్ధ రాత్రి దాటాక మెలుకవ వచ్చిన జానకమ్మ నీళ్ళు త్రాగుదామని లేచి వంటగది వైపు రెండడుగులు వేసింది. రవి పడుకున్న గది తలుపులు, మెయిన్ డోర్ తలుపులూ తెరచి వుండటం గమనించి గదిలోకి తొంగిచూసింది.

గదిలో ఆయన మంచం ఖాళీగా కనిపించింది. యెదురుగా తెరచిన బీరువా చిందరవందరగా గుడ్డలు... " కొంప

మునిగిందండీ .. " బిగ్గరగా అరుస్తూ భర్తను లేపింది. లేచిన అతనికి పరిస్థితి అర్థమైంది.

జానకమ్మ లబోదిబో మంటూ అరవటంతో అందరూ నిద్ర లేచారు. పరిస్థితి అర్థమైంది. బీరువాలోని నగలు, ఖరీదయిన బట్టలు కనిపించలేదు. చుట్టుప్రక్కల వాళ్ళను లేపి ఊరికి నాలుగు ప్రక్కలా వెతికారు. ఫలితం లేదు. అపరిచితుడు యెప్పుడో వుడాయించాడు.




మా ఆత్మారాముడు చెప్పిన నిజం ఆత్మ కథే. దేవుడున్నాడు. అయితే పూర్వ కాలంలోలా అసలు రూపంతో ప్రత్యక్షమయ్యి వరాలు కోరుకోమనటం లేదిప్పుడు. ఎవరైనా కిడ్నాప్ చేస్తారనే భయం కావచ్చు. వేరే రూపాలలో -- మనకి తెలిసిన వాళ్ళ లాగో, మరొకలాగో కనపడి మనకి తరుణోపాయం చూపిస్తాడుట! యిది మా ఆత్మారాముడి అనుభవం అంటాడు.

ఆత్మారాముడు ఆత్మహత్య చేసుకుందామని తిరుమల వెళ్ళాడు. తిరుమలే ఎందుకంటే ఆయన మీద కోపంతో. ఆయన్ని చాలా సార్లు వేడుకున్నాడు తన కష్టాలు గట్టెక్కించమని. ప్రతి శనివారం పొద్దున్నే తలంటి పోసుకుంటాడు. వొంటి పొద్దు వుంటాడు.

సాయంత్రం ఏమీ ఆహారం తీసుకునే వాడు కాదు. సాయంత్రం గుడికి వెళ్లి దణ్ణం పెట్టుకునేవాడు. చాలా సేపు గుడిలోనే వుండేవాడు. అక్కడున్నంతసేపు ఒక పక్కన కూచుని కళ్ళు మూసుకుని ప్రార్ధన చేసుకునేవాడు. నిజం చెప్పొద్దూ నేనూ వెళ్ళే వాణ్ని గుడికి అక్కడ పెట్టే ప్రసాదాల కోసం. అయినా వాడి కష్టాలు గట్టెక్కలేదు. పైగా ఎక్కువయ్యాయి అని బాధ పడేవాడు. సరేలే దేవుడు పరీక్షిస్తున్నాడేమో అనుకున్నాడు. నేనూ అలాగే సర్ది చెప్పేను. కష్టాలు కలి కాలమంతా వుండవు అని కూడా చెప్పేను. కలి కాలం కాదు కల కాలం అని ఆ పక్కనాయన చెప్పాడు.

తిరుమలలో శ్రీవారి దర్శనం చేసుకున్నాడు. తిన్నగా ఆయనకే చెప్పేడు. నా కష్టాలు నేనే కడతేర్చుకుంటున్నాను ఆత్మహత్య చేసుకోబోతున్నాను, ఈ కొండ మీదే. నా గురించి నువ్వేం కష్ట పడొద్దు అని. బైటికి వచ్చి ప్రసాదం లడ్డు తిన్నాడు తృప్తిగా. అలా దూరంగా కొండల చివరకి బయల్దేరేడు. దారిలో తనని గుర్తించే అన్ని వస్తువులని కింద లోయలోకి అక్కడక్కడా విసిరేసికుంటూ ఒక కొండ అంచుకి చేరేడు. చుట్టూ పరికించి చూసేడు. దరి దాపుల్లో జీవ సంచారం లేదు. గాలికి చెట్లు చేసే శబ్దం హాయిగా వుంది. చల్లటి గాలి , అందమైన ప్రకృతి ఆహ్లాదంగా వుంది వాతావరణం. తన కార్యక్రమాన్ని కొద్ది సేపు వాయిదా వేసి ఆ వాతావరణాన్ని అనందించాలనుకున్నాడు. ఒక చెట్టు కిందకి చేరేడు. తనకి తెలియకుండానే నిద్రలోకి జారి పోయేడు. కళ్ళు తెరిచి చూసేసరికి ఎదురుగా ఒక పల్లెటూరి ఆసామి కూచునున్నాడు.

తనని చూసి నవ్వి అన్నాడు. ' నేనిక్కడ ఆవుల్ని మేపుకోటానికొచ్చా. రోజూ వస్తా. తరుచూ యిక్కడ నీ లాంటోళ్ళు కనపడుతుంటారు. చాలా మంది ఆత్మహత్య చేసుకోవటానికే వస్తుంటారిక్కడికి. చాలా మందిని వెనక్కి తీసుకెళ్ళి పోతుంటా. నిన్ను చూస్తే బాగా చదువుకున్నోడిలా వున్నావు. నువ్వూ అందుకోసమే వచ్చావేమో అని అనుమానం వేసి వచ్చా. చాలా సేపటినించి పడుకున్నావు. ఎప్పుడు తిన్నావో యిదో ఈ ప్రసాదం తిను. మా అయ్యోరు యిస్తాడు నాకు.' అని అంటూ తన మూట విప్పి అందులోని సత్తు గిన్నెలోని చక్కర పొంగలి, పులిహోర ఆత్మారాముడి ముందు పెట్టేడు. అవి చూస్తూనే ఎక్కడ లేని ఆకలి కలిగింది. గబగబా తినేసాడు. అప్పుడు ఆలోచన కలిగింది -ఆతను తినలేదని. అతని వంక చూసేడు తప్పు చేసినట్టు . 'ఫరవాలేదు బిడ్డా. నా కొడుకు లాంటోడివి. నీ ఆకలి తీరింది అంతే చాలు. పద పద కిందకి ఎల్దాం. నీకు మంచి భవిష్యత్తు వుందయ్యా. పిచ్చి ఆలోచనలు చెయ్యబోక.' అని లేచి ముందు నడుస్తుంటే తను వచ్చిన పని మర్చిపోయి అతని వెనకాలే కొండ దిగేడు మంత్ర ముగ్ధుడిలా.

తన ఆలోచనల్లో అతన్ని గమనించలేదు. కాసేపయ్యాక గమనిస్తే తన ముందు అతను గాని, ఆవులు గాని కనపడలేదు. సరే ఇక చేసేదేం లేక తన కార్యక్రమాన్ని వాయిదా వేసుకుని యింటికి వెళ్ళటానికి సిద్ధ పడ్డాడు. జేబులో పైసా లేదు. ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఎదురుగా ఆర్టీసి బస్సు స్టాండు వుంది. అక్కడికి వెళ్ళేడు. సరే ఏమయితే అది అయ్యిందని అక్కడ కంట్రోలర్ని అడిగి డిపో అధికారి దగ్గిరకి వెళ్ళేడు. ఆయనకి వున్న విషయం చెప్పేసేడు. యిప్పుడు తన యింటికి వెళ్ళాలంటే తనకి ఆర్ధిక సహాయం చేస్తే యింటికి వెళ్ళగానే ఆ డబ్బు పంపించేస్తానని చెప్పేడు. ఆ డిపోలో ఒక ఆచారం పెట్టుకున్నారక్కడి కార్మికులంతా కలిసి. తమ జీతం లోంచి కొంత మొత్తం తీసి ఒక బ్యాంకు అక్కౌంట్లో వేస్తారు. ఎవరైనా డబ్బులు లేక యిబ్బంది పడే భక్తులకి సహాయం చేయటానికి ఉపయోగ పడుతుందది. భక్తులెవరైనా తిరిగి పంపిస్తే ఆ మొత్తాన్ని ఈ అకౌంటులోనే జమ చేస్తారు.

ఎందుకంటే రోజూ యిలా యిబ్బంది పడేవాళ్ళని చాలా మందిని చూస్తుంటారు. ఒకడిగా సహాయం చెయ్యలేరు కనుక ఈ ఏర్పాటు చేసుకున్నారు. సహాయం పొందిన భక్తుల ముఖంలో తొంగి చూసే అనందం వారికి ఎంతో తృప్తినిస్తుంది. అలాటి భక్తులు రాసే ఉత్తరాలు అందరికీ చదివి వినిపిస్తారు నెలకోసారి జరిగే సమావేశంలో. అప్పుడే జామా ఖర్చులు చెప్తారు. ఎవరికీ యింత వరకూ ఎటువంటి అసంతృప్తి లేదు ఆ నిధి నిర్వహణ పట్ల. ఎందుకంటే ప్రతి ఏడాది సభ్యులు మారిపోతుంటారు.

ఆ డిపో మేనేజెర్ గారు అలా ఆత్మ రాముడికి సహాయం చేసేరు. అతను వూరు చేరుతూనే ఆ డబ్బు పంపటమే కాదు ప్రతి నెలా తను కూడా డబ్బు పంపటం అలవాటు చేసుకున్నాడా నిధికి. అతనికి ఎంతో తృప్తిగా వుందలా చెయ్యటం.

గమ్మత్తేవిటంటే, ముప్పైఏళ్ళ తర్వాత యిప్పటి దాక మళ్ళీ ఆత్మ హత్య చేసుకోవాలనుకోలేదు. పై పెచ్చు తను ఉద్యోగ రీత్యా ఎన్నో వున్నత స్థానాలకి ఎదిగాడు. తన భార్యా పిల్లలతో సంతోషంగా వున్నాడు. పిల్లలు చక్కగా చదువుకుని మంచి ఉద్యోగాల్లో వున్నారు. తన కథ పిల్లలకి చెప్పేడు - వాళ్ళకి ఇలాంటి ఆలోచన రాకూడదని. యిప్పుడు ఆత్మహత్య చేసుకునే ఆలోచన కలిగిన వాళ్ళని ఆ ఆలోచన నించి మళ్లించేలా ఒక కౌన్సిలింగ్ సెంటర్ పెట్టేడు. ఉచిత సహాయం. ఎంతో మందిని ఆ ఆలోచన నించి తప్పించేడు.

యిన్నేళ్ళ తర్వాత యిప్పుడంటాడు - ఆ రోజున నన్ను కాపాడింది ఆ దేవుడే ! పసువుల కాపరి రూపంలో వచ్చేడు. తన ప్రసాదమే పెట్టేడు. ఆకలి తీర్చేడు. ఆలోచన మార్చేడు. నిజమేనేమో అనిపిస్తోంది కదూ.




'నానీ' అని అమ్మానాన్నలతో ముద్దుగా పిలవబడే సుధీర్ ఏడవ తరగతి చదువుతున్నాడు.

ఆ రోజు సాయంకాలం స్కూలు వదిలాక తొమ్మిదో తరగతి చదివే రణధీర్ పిలిచాడు.

"ఆటో వెళ్ళిపోతోంది అన్నా...నేను వెళ్ళాలి..." చెప్పాడు నాని.

"వెళుదువు లేరా... నీకో మంచిది చూపిస్తా... ఉండు..." అని నానీ ఫ్రెండ్, పక్కింటి అబ్బాయి అయిన శేషు తో "నేను వీడిని ఇంటి దగ్గర దింపేస్తా... నువ్వు వాళ్ళమ్మా వాళ్ళతో చెప్పు..." అన్నాడు రణధీర్.

ఏమనాలో తెలియక తలూపి వెళ్ళిపోయాడు శేషు.

రణధీర్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. పదహారేళ్ళు నిండాయి. చదువంట లేదు, కానీ దురభ్యాసాలు బాగానే అలవాటు అయ్యాయి. తండ్రికి ఒక్కడే కొడుకు కావటం చేత వీడు ఆడింది ఆట, పాడింది పాటగా జరుగుతున్నా, ఈ మధ్య డబ్బుకు ఇబ్బంది పడుతూ ఉన్నాడు...

"అరేయ్ సుధీర్, ఇదిగో ఈ సిగరెట్ కాల్చరా..." అని బలవంతంగా నోట్లో వెలుగుతున్న సిగరెట్ పెట్టాడు.

వద్దు వద్దంటున్నా. ముందు ఉక్కిరి బిక్కిరి అయినప్పటికీ ఆ పొగ లోపలి వెళుతూ ఉంటే ఏదో మజాగా అనిపించింది నానికి.

"ఏరా, బాగుందా?" అడిగాడు రణధీర్.

అమాయకంగా తలూపాడు నాని.

"మరింకా కావాలా?"

"నో, వద్దు... మా నాన్న స్మోక్ చేస్తే చంపేస్తారు..." భయంగా అన్నాడు నాని.

"సర్లే, నిన్ను ఫోర్స్ చేయను కాని, రేపు వచ్చేటప్పుడు రెండు వందలు పట్రా?"

"డబ్బులా? నాకు మా నాన్న ఇవ్వరు.." చెప్పాడు నాని.

"స్కూల్లో ఏదో ఫీజు కట్టాలని చెప్పి తీసుకురారా..."

"నేను వెళిపోతాను..."బయటకు కదలబోయాడు నాని.

“ఎక్కడికిరా…” బలంగా షర్టు పట్టుకుని ఆపాడు రణధీర్…

“నన్ను వదిలెయ్యి…” కోపంగా విడిపించుకుని బయటకు పరుగుతీసాడు నాని.

వెనకాలే రాబోయి, అటుగా ఎవరో రావటం వలన ఆగిపోయాడు రణధీర్.

***

నానీ నడుచుకుంటూ ఇల్లు చేరే సరికే బాగా ఆలస్యం అయిపోయింది.

ఆలస్యానికి కారణమడిగిన తల్లితో నోట్స్ రాసుకోవటానికి వేరే క్లాస్ మేట్ ఇంటికి వెళ్లానని చెప్పాడు.

మర్నాడు స్కూల్ టైం అయి బయలుదేరే ముందు అడిగింది సుమతి.

“ఏరా, రణధీర్ తో నీకేం పని? వాడు ఆగమంటే ఎందుకు ఆగాల్సి వచ్చింది? స్కూలు అయ్యాక వాడితో పనేంటి, తిన్నగా ఇంటికి వచ్చేయక?” గట్టిగా నిలదీసింది.

గుమ్మం చాటుగా తొంగి తొంగి చూస్తున్నాడు శేషు.

“నేను వచ్చేస్తుంటే….” చెప్పబోయాడు నాని.

“వాడు, వాళ్ళ గాంగ్ అంతా  కలిసి స్కూలు అయ్యాక సిగరెట్లు కాలుస్తారట… ఇంకా పిచ్చి పనులు ఏవేవో చేస్తారట… అలా

ఎప్పుడైనా వెళ్తావా?" పట్టలేని కోపంతో వీపు మీద గట్టిగా ఒక దెబ్బ వేసింది సుమతి. శేషు ఎదురుగా అలా కొట్టేసరికి పట్టరాని కోపం వచ్చేసింది నానికి. తల్లినుంచి తప్పించుకుని పక్కకి జరిగి నిలబడ్డాడు ఎర్రబడ్డ ముఖంతో.

"అసలే అంతంత మాత్రం జీతాలతో కష్టపడి నిన్ను చదివిస్తున్నారు మీ నాన్న... ఉదయమే వెళ్ళిపోయారు ఫ్యాక్టరీకి... ఎందుకింత కష్టపడుతున్నారు? నీ భవిష్యత్తుకే కదా..." ఇంకా ఏదో చెప్పబోతున్న సుమతి మాటల్ని ఖాతరు చేయకుండా బయటికి నడిచాడు కోపంగా తలెగరేస్తూ....

"ఒరేయ్ నానిగా... సిగరెట్లు కాల్చటం నేర్చుకోకురా... ఇల్లూ వళ్ళూ గుల్లవుతుంది. బడినుంచి తిన్నగా ఇంటికి రా నాయనా!" తల్లి మాటలు వెనుకనుంచి వినిపిస్తూనే ఉన్నాయి.

***

"నానీ, నానీ..." శేషుగాడి మాటలు వినిపించనంత దూరం పరుగుతీసి గుడిలోకి వెళ్ళిపోయాడు నాని. గుడి వెనకాల మంటపంలో కూర్చుని ఏడవసాగాడు. 'అసలేం జరిగిందో తెలియకుండా అమ్మ కొట్టింది. అదీ శేషుగాడి ఎదురుగా... వాడు తన మీద నేరాలు చెప్పాడు...' ఉడుకుమోత్తనంగా అనిపించింది. కాసేపు ఏడ్చి, తెలుగు వాచకం తీసుకుని చదువుకున్నాడు. ఇంగ్లీష్ పోయెం రఫ్ బుక్ లో నాలుగు సార్లు రాసాడు, నోటికి వచ్చేదాకా. లెక్కల అచ్చు పుస్తకం తీసి, రఫ్ బుక్ లో కొన్ని లెక్కలు చేసుకున్నాడు. సూర్యుడు నడినెత్తి మీదికి వచ్చేసాడు. గుడి మూసే సమయం అయిందేమో, పూజారి గారు అటువైపు వచ్చారు.

"ఎవరబ్బాయివి బాబూ... యూనిఫారం లో ఉన్నావు, బడికి వెళ్ళలేదా?" ఆరా తీసారు.

నానీ మౌనంగా ఉండిపోయాడు. ఏమనుకున్నాడో ఏమో ఆ పూజారి గారు ఒక అరిటాకులో ప్రసాదం పెట్టి ఇచ్చారు. ఉదయం నుంచి ఏమీ తినలేదేమో, ఆవురావురుమంటూ తినేసి బయట పడ్డాడు.

మూడయ్యే సరికి అటూ ఇటూ తిరిగి ఊరి చివర పార్కు దగ్గరికి వెళ్ళాడు.

"మంచి పనైంది... ఒక్క రోజు ఇంటికి వెళ్ళకపోతే అమ్మా, నాన్నా కంగారు పడాలి... ఇక్కడికి వచ్చి బ్రతిమాలి ఇంటికి

తీసుకుపోవాలి... అంతే...” శపథం చేసుకుని స్కూల్ బాగ్ తలకింద పెట్టుకుని బెంచి మీద పడుకున్నాడు.

***

అకస్మాత్తుగా మెలకువ వచ్చింది నానికి. ఒక్క క్షణం తాను ఎక్కడ ఉన్నాడో అర్థం కాలేదు. చీకటి పడిపోయింది. పార్కులోని బెంచి మీద సాయంత్రం పడుకున్నాడని గుర్తు వచ్చింది. ఊరి చివర ఉన్న పార్కు కాబట్టి ఇంచుమించు నిర్మానుష్యంగా ఉంది అక్కడ. ఒక్క క్షణం భయమేసి ఇంటికి వెళ్ళిపోవాలని అనిపించినా అమ్మ బాగా తిట్టిన విషయం గుర్తు వచ్చి కోపం వచ్చింది. అవును వెళ్ళకూడదు... తాను లేకపోతే ఎలా ఉంటుందో అమ్మకి నాన్నకి తెలియాలి బాగా... లేకపోతే తన ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతుందా? మళ్ళీ కోపం వచ్చేసింది నానికి.

బెంచి మీదనుంచి కిందికి చూస్తే ఆ మసక చీకట్లో, గడ్డిలో ఏదో పాకినట్టు అనిపించింది. ‘అమ్మో పామేమో...’ కెవ్వున అరవబోయి ఆపుకున్నాడు నానీ... ఇంతలో మాటలు వినిపించాయి. కొంచెం దూరంగా ఉన్న చెట్టు చాటు నుంచి యేవో మాటలు...

“ఏరా...ఎంత మంది దొరికారు?” కర్కశంగా వినిపించిందో మగ గొంతు.

“ఈరోజు ఎవరూ దొరకలేదు అన్నా...” వినయంగా చెబుతున్నాడు మరొకతను.

“ఏమ్మాయ్ నీకూ?”

“నాకూ దొరకలేదన్నా...” మరింత వినయంగా చెప్పిందో ఆడ గొంతు.

“బడి నుంచి ఇంటికి వెళ్ళే పిల్లలు ఎవరూ దొరకలేదా?”

“ఎక్కడన్నా, ఒంటరిగా వెళ్ళటం లేదు ఎవరో గాని... ఆటో లోనో, స్కూలు బస్సులలోనో, తల్లిదండ్రుల స్కూటర్ల మీదో వెళుతున్నారు. పిల్లల్ని మాయ చేసి తీసుకురావటం కష్టం గానే ఉంది.”

“ఎలాగరా ఇలా అయితే? పిల్లలు దొరికితే వాళ్లకి కళ్ళు పొడిచేసో, కాళ్ళు విరిచేసో వేరే రాష్ట్రాలకు తీసుకుపోయి, బిచ్చగాళ్ళుగా తయారు చేసే స్కీం పెట్టుకున్నాడు కదా మన బాసు? మీరు వాళ్ళని తీసుకురాకపోతే ఎలా? ఎంత బిజినెస్ లాసు మనకి? ఊ… సరే… ఎవరైనా మనల్ని గమనిస్తే ప్రమాదం కానీ, రేపు మీరు ఎవర్నైనా పట్టుకురండి. ఇప్పటికి వెళ్ళిపోదాం…రేపు ఇక్కడే కలవాలి…” బీడీ వెలిగిస్తూ బయటికి వచ్చి గేటు లోంచి వెళ్ళిపోయాడు నల్లగా తుమ్మ మొద్దులా ఉన్న ఒక రౌడీ లాంటి అతను. అతని వెనకాలే వాళ్ళిద్దరూ కూడా వెళ్ళిపోయారు.

మందార చెట్టు గుబురు అడ్డం రావటం వలన నానిని వాళ్ళెవరూ గమనించలేదు.

నానికి గుండె గొంతులోకి వచ్చిన భావన కలిగింది. వళ్ళంతా చెమటలు పట్టేసాయి. గుండె దడదడా కొట్టుకోవటం మొదలైంది. మొన్న టీవీలో చూపించారు. బడి పిల్లల్ని మాయచేసి వాళ్లకి బలవంతంగా అంగవైకల్యం కలిగించి భిక్షాటన లోకి దించే ముఠా తిరుగుతోంది, తస్మాత్ జాగ్రత్త అని… వీళ్ళే కాబోలు…

మెల్లగా లేచి గేటు తెరచుకుని బయటికి వచ్చాడు. చీకట్లో ఇంటికి వెళ్ళాలంటే భయం వేస్తోంది. పైగా సరైన తిండీ తిప్పలూ లేక ఒళ్ళంతా నీరసంతో తూలుతోంది…

అటుగా ఒక ఆటో వస్తే ఆపాడు. తన ఇంటి అడ్రెస్ చెబుతూ ఉంటే, “ఎవరూ, నానీ బాబా? నువ్వు దక్షిణామూర్తి గారి అబ్బాయివి కదా… నేను సూరిబాబును. మీ ఇంటి వెనకాలే ఉంటానయ్యా… రా ఎక్కు…” అని ఆటో ఎక్కించుకుని, “ఎక్కడికి పోయావయ్యా, మీ అమ్మా, నాన్నా నువ్వేమయ్యావో తెలియక ఎంత దిగులుగా ఉన్నారో తెలుసా? పోలీస్ స్టేషన్ కి వెళ్లి కంప్లైంట్ కూడా ఇస్తానన్నారు మీ నాన్నగారు…” అని ఇంకా ఏదో చెప్పబోతుంటే, బావురుమని ఏడ్చేశాడు, నాని. ఉదయం నుంచి జరిగిన అనుభవాలు గుర్తు తెచ్చుకుంటూ.

“పెద్దోళ్ళు మీకోసమే కదయ్యా చెబుతారు? పిల్లలు చెడు సావాసాలు పట్టి పాడై పోకూడదని వాళ్ళు తాపత్రయ పడతారు. అమ్మా నాన్నలు తిట్టినా కొట్టినా వాళ్ళమీద కోపం పెట్టుకోకూడదు…” అనునయంగా చెప్పాడు ఆటో సూరి.

“అవును అంకుల్…” దిగులుగా అన్నాడు నాని.

ఇల్లు చేరే సరికి గుమ్మంలో ఏడుస్తూ కూర్చుని కనబడింది తల్లి.

“ఇన్స్పెక్టర్ నాకు తెలిసినాయనే... తెల్లారే సరికల్లా బాబు మన దగ్గరుంటాడు... ఏడవకు సుమతీ...” తనకూ బెంగగా ఉన్నా మెల్లగా చెబుతున్నాడు దక్షిణామూర్తి.

“అనవసరంగా చేయి చేసుకున్నానండి పిచ్చి వెధవని... ఉక్రోషంగా వెళ్లి ఆటో ఎక్కాడని అనుకున్నానే కాని... ఎంత అశ్రద్ధగా ఉన్నానో, అసలేం తల్లినండీ నేను?” వెక్కుతూ అంది సుమతి.

ఆటో దిగి ఒక్క ఉదుటున “అమ్మా...” అంటూ ఎగిరి దూకి సుమతి ఒడిలో తల దాచుకున్నాడు నాని.

“నానీ, వచ్చావా నాన్నా.. ఎక్కడికి వెళ్ళిపోయావురా..?” ఆర్తిగా వాడిని గుండెకు అదుముకొని తలమీద ముద్దుల వర్షం కురిపించసాగింది సుమతి.

“సారీ అమ్మా, సారీ డాడీ...” కళ్ళ నీళ్ళ పర్యంతం అయ్యాడు నాని.

***

మర్నాడు స్కూల్లోంచి అకస్మాత్తుగా సస్పెండ్ అయ్యాడు, రణధీర్. దానికి ముందు వాడిని సోదా చేస్తే వాడి దగ్గరున్న సిగరెట్లలో డ్రగ్స్ ఉన్నాయని తెలిసింది. వాడికి అవి ఎవరు సప్లై చేస్తున్నారో కూపీ లాగటం మొదలైంది.

అదే రోజు సాయంత్రం ఊరి చివరి పార్కులో కిడ్నాపర్స్ ముఠా అడ్డంగా దొరికిపోయారు పోలీస్ వారి రైడ్ లో...

ఇన్స్పెక్టర్ నానిని అభినందిస్తూ ‘థాంక్స్’ చెబుతూంటే, సిగ్గుపడి, అమ్మా నాన్నల వంక అపరాధభావనతో చూసాడు, నాని.